RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్ర ప్రదేశ్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న

జన సంఘర్షణ దిన పత్రికలో

పనిచేయుటకు జిల్లా బ్యూరో, స్టాఫ్ రిపోర్టర్లు,

నియోజకవర్గ ఆర్.సి.ఐ, మండల స్థాయి విలేకర్లుగా

పనిచేయుటకు ఆసక్తి, ఉత్సాహం కలిగిన

యువతి యువకులు కావలెను.

సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

9550558911-6305026524

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 34 | మే 01 శుక్రవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 34 | May 01 Friday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |

## నిరంతర విద్యుత్ సరఫరాను అందించడమే

# ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**నిరంతర విద్యుత్ సరఫరా.. విద్యుత్ శాఖకు భట్టి విక్రమార్క ఆదేశాలు**

- రాష్ట్రంలో తీవ్రమైన వేసవి తాపం కారణంగా విద్యుత్ డిమాండ్
- దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ దృష్ట్యా, రాష్ట్ర విద్యుత్ సరఫరా పరిస్థితిపై ఉప ముఖ్యమంత్రి ప్రజా భవన్‌లో ఇంధన శాఖ సీనియర్ అధికారులతో సమీక్షా సమావేశం
- విద్యుత్ ఎక్స్ఛేంజ్‌ల ద్వారా అదనపు విద్యుత్‌ను సేకరించాలి
- రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ స్థిరంగా ఉందని, ఎటువంటి సవాలనైనా ఎదుర్కోవడానికి తగిన ఏర్పాట్లు



**హైదరాబాద్,జనసంఘర్షణ**

ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఇంధన శాఖ మంత్రి భట్టి మాట్లాడుతూ.. రాష్ట్రంలో తీవ్రమైన వేసవి తాపం కారణంగా విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నప్పటికీ, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరాను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ దృష్ట్యా, రాష్ట్ర విద్యుత్ సరఫరా పరిస్థితిపై ఉప ముఖ్యమంత్రి ప్రజా భవన్‌లో ఇంధన శాఖ సీనియర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో పాటు, ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీలు, కూలర్ల వినియోగం గణనీయంగా పెరిగిందని అధికారులు మంత్రికి తెలియజేశారు. ఈ పరిస్థితికి వ్యవసాయ అవసరాలు కూడా తోడవడంతో, విద్యుత్ గ్రిడ్‌పై అదనపు ఒత్తిడి ఏర్పడింది. దేశవ్యాప్తంగా విద్యుత్ మార్కెట్‌పై తీవ్రమైన ఒత్తిడి ఉన్నప్పటికీ, రాష్ట్ర అవసరాలకు ఎటువంటి కొరత లేకుండా చూసేందుకు, విద్యుత్ ఎక్స్ఛేంజ్‌ల ద్వారా అదనపు విద్యుత్‌ను సేకరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.



## ఆపరేషన్ సిందూర్ నిలిపివేత

# భారత్ సొంత నిర్ణయం

- ఆపరేషన్ సిందూర్ నిలిపివేతపై రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు
- అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి సిద్ధంగా ఉన్నామన్న రాజ్‌నాథ్ సింగ్
- ఆపరేషన్ నిలిపివేయడం వెనుక వ్యూహం ఉందన్న కేంద్రమంత్రి

**న్యూఢిల్లీ,జనసంఘర్షణ**


ఆపరేషన్ సిందూర్ నిలిపివేతపై కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను భారత్ తన సొంత నిర్ణయం మేరకే నిలిపివేసిందని ఆయన అన్నారు. కానీ అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఏఎన్ఐ నిర్వహించిన నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్ 2.0లో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ నిలిపివేత వ్యూహాత్మక నిర్ణయమేనని అన్నారు. కానీ సామర్థ్యం లేక నిలిపివేయలేదని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్ మన సాయుధ దళాల సమైక్యతకు ఒక ఉదాహరణ అన్నారు. మన త్రివిధ దళాలు సమన్వయంతో ముందుకు వెళ్లాయని ప్రశంసించారు. సొంత నిబంధనలు, నిర్ణయం ప్రకారమే సరైన సమయంలో దానిని ముగించామని తెలిపారు. ఇది మనం స్వచ్ఛందంగా తీసుకున్న నిర్ణయమని పునరుద్ఘాటించారు.

## అమరావతిపై వైసీపీ

# దుష్ప్రచారాన్ని ఎదుర్కోండి

- మంత్రుల సింగపూర్ పర్యటనపై వైసీపీ విమర్శలను ఖండించిన చంద్రబాబు
- సింగపూర్ మరెవరికీ ఇవ్వని అవకాశాన్ని ఏపీకి ఇచ్చిందని వెల్లడి
- అమరావతిలోని భవనాలను ప్రపంచ స్థాయిలో నిర్మిస్తున్నామన్న సీఎం

**అమరావతి,జనసంఘర్షణ**



ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రులకు ఆయన పలు సూచనలు చేశారు. ముఖ్యంగా మంత్రుల సింగపూర్ పర్యటన, అభివృద్ధి పనులపై ప్రతిపక్షం చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని సూచించారు. మంత్రుల సింగపూర్ పర్యటనపై వైసీపీ చేస్తున్న విమర్శలను సీఎం తీవ్రంగా ఖండించారు. సింగపూర్ ప్రభుత్వం మరెవరికీ ఇవ్వని అరుదైన అవకాశాన్ని ఏపీకి ఇచ్చిందని, దీనిని రాజకీయం చేయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. పాలనలో మెళకువలు, సంపద సృష్టి కోసం జరిగిన ఈ పర్యటనను ప్రజలకు వివరించాలని మంత్రులకు సూచించారు. "మనం ఇతర దేశాల కంటే తక్కువ ఖర్చుతో, అత్యాధునిక టెక్నాలజీతో నిర్మాణాలు చేస్తున్నాం"



## ఉద్యమంలో బీఆర్ఎస్‌తో కలిసి

# పనిచేశాం

- బీఆర్ఎస్ చచ్చిన పాములాంటిదన్న డాక్టర్ కె. లక్ష్మణ్
- ప్రజలు నమ్మకంతో ప్రతిపక్ష హోదా ఇస్తే కేసీఆర్ సభకు రావడం లేదని విమర్శ

**హైదరాబాద్,జనసంఘర్షణ**

తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉద్యమం సమయంలో బీఆర్ఎస్‌తో కలిసి పనిచేశామని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ ఒక చచ్చిపోయిన పాములాంటిదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని జోస్యం చెప్పారు.

## ఏపీ, తెలంగాణకు మూడు రోజుల పాటు

# వర్ష సూచన

- ఉపరితల ద్రోణి ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం
- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ
- ఉరుములు మెరుపులతో కూడిన వానలు పడతాయని హెచ్చరిక



**హైదరాబాద్,జనసంఘర్షణ**

భానుడి భగభగలతో అల్లాడిపోతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ చల్లటి కబురు అందించింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో రాబోయే మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మున్నార్ గల్ఫ్ వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఈ ద్రోణి విస్తరించి ఉన్నట్లు వెల్లడించింది.

## తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి

# పదవీ విరమణ

- 32 ఏళ్లపాటు పోలీసు అధికారిగా సేవలందించిన శివధర్ రెడ్డి
- పోలీస్ అకాడమీలోని పరేడ్ గ్రౌండ్ లో గౌరవ వందనం

**హైదరాబాద్,జనసంఘర్షణ**



తెలంగాణ పోలీస్ శాఖలో మరో చిరస్మరణీయ అధ్యాయం ముగిసింది. సుమారు 32 ఏళ్ల పాటు నిష్కళంకమైన సేవలు అందించిన డీజీపీ బి.శివధర్ రెడ్డి నేడు పదవీ విరమణ చేశారు. ఆయన పదవీ విరమణ సందర్భంగా తెలంగాణ పోలీస్ అకాడమీలోని పరేడ్ గ్రౌండ్ లో గౌరవ వందనాన్ని నిర్వహించారు.

## ఏపీ టెన్త్ ఫలితాల విడుదల..

# బాలికలదే పైచేయి

- మొత్తం 85.25 శాతం ఉత్తీర్ణత నమోదు
- బాలికల ఉత్తీర్ణత శాతం 87.90%.. బాలుర ఉత్తీర్ణత 82.68%

**అమరావతి,జనసంఘర్షణ**

ఏపీలో పదో తరగతి విద్యార్థుల నిరీక్షణకు తెరపడింది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఉదయం 11 గంటలకు టెన్త్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. ఈ ఏడాది మొత్తం 85.25 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఆయన ప్రకటించారు. గత ఏడాదితో పోల్చి చూస్తే ఉత్తీర్ణత శాతం 4 శాతానికి పైగా పెరగడం గమనార్హం.



## కవిత కొత్త పార్టీకి ఈసీ గ్రీన్ సిగ్నల్

- కల్వకుంట్ల కవిత కొత్త పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం
- 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్)గా పార్టీ పేరు ఖరారు
- మొదట 'తెలంగాణ రాష్ట్ర సేన'గా ప్రకటించిన కవిత



**హైదరాబాద్,జనసంఘర్షణ**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్థాపించిన కొత్త రాజకీయ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అధికారికంగా ఆమోదముద్ర వేసింది. కవిత పార్టీకి 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) అనే పేరును ఖరారు చేస్తూ సీఈసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఎన్నికల సంఘం అధికారులు బంజారాహిల్స్‌లోని కవిత నివాసానికి వెళ్లి అధికారిక లేఖను అందజేశారు.

జన సంఘర్షణ

01 శుక్రవారం, మే 2026

## ఉద్యమంలో బీఆర్ఎస్‌తో
# కలిసి పనిచేశాం

**మొదటిపేజీ తరువాయి**

ప్రజలు ఎంతో నమ్మకంతో ప్రతిపక్ష హోదా కల్పిస్తే, కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని విమర్శించారు. సభకు రావడం లేదని, ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడం లేదని అన్నారు. ప్రభుత్వంతో బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకుందని ఆరోపించారు. రెండు పార్టీలు లోపాయికారి ఒప్పందంతో ముందుకు సాగుతున్నాయని అన్నారు. బీజేపీ తెలంగాణలో అజేయశక్తిగా ఎదుగుతోందని, కానీ ఆ పార్టీలు దొడ్డిదారిన అడ్డుకునే కుట్రలు చేస్తున్నాయని అన్నారు.తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీఆర్ఎస్‌తో కలిసి ఉద్యమంలో పనిచేశామని అన్నారు. కానీ తాము ఎప్పుడూ ఎవరితో పొత్తు పెట్టుకోలేదని అన్నారు. స్థానిక ఎన్నికలైనా, మరే ఎన్నికైనా ఒంటరిగానే పోటీ చేస్తామని అన్నారు. భవిష్యత్తులోనూ ఒంటరిగా పోటీ చేస్తామని పేర్కొన్నారు. నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని అయ్యాక తెలంగాణకు మొదటిసారి రాబోతున్నారని తెలిపారు. మే 10న పరేడ్ మైదానంలో జనాగ్రహ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## నిరంతర విద్యుత్ సరఫరాను
# అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

ఆసుపత్రులు, తాగునీటి సరఫరా పథకాలు, ఇతర అత్యవసర సేవలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండకూడదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. నిరంతర పర్యవేక్షణకు అధికారులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అన్ని విద్యుత్ ఉత్పాదక యూనిట్లను వాటి పూర్తి సామర్థ్యంతో వినియోగించుకోవాలని, జలవిద్యుత్ ఉత్పత్తిని సమర్థవంతంగా నిర్వహించాలని కూడా ఉపముఖ్యమంత్రి ఆదేశించారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, విద్యుత్ సంస్థలన్నీ పరస్పర సమన్వయంతో పనిచేయాలని, ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ స్థిరంగా ఉందని, ఎటువంటి సవాలనైనా ఎదుర్కోవడానికి తగిన ఏర్పాట్లు ఉన్నాయని అధికారులు మంత్రికి హామీ ఇచ్చారు.పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించి, అన్ని వర్గాల వినియోగదారులకు నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాను నిర్ధారించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని పునరుద్ఘాటిస్తూ, క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ౧=ూచీూజూ జవీణ కృష్ణ భాస్కర్, +జుచీజూ జవీణ హరీష్, ౧ూణజూ జవీణ జితేష్ వి. పాటిల్, ఇతర అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## ఆపరేషన్ సిందూర్ నిలిపివేత
# భారత్ సొంత నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి**

పాకిస్థాన్ అంతర్జాతీయ ఉగ్రవాదానికి కేంద్రబిందువు అని రాజ్‌నాథ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఉగ్రవాదం కేవలం దేశ వ్యతిరేక చర్య మాత్రమే కాదని, దానికి బహుముఖ కోణాలు ఉన్నాయని అన్నారు. దానిని కూకటివేళ్లతో పెకలించాలని ఆయన పిలుపునిచ్చారు. పాకిస్థాన్ అనునిత్యం ఉగ్రవాదానికి మద్దతుగా నిలుస్తోందని ఆరోపించారు. భారత్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి కేంద్రమైతే పాకిస్థాన్ మాత్రం తీవ్రవాదానికి కేంద్రబిందువు అని రాజ్‌నాథ్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఏపీ, తెలంగాణకు మూడు రోజుల పాటు వర్ష సూచన

**మొదటిపేజీ తరువాయి**

ఈ వాతావరణ మార్పుల వల్ల గురువారం నుంచి శనివారం వరకు రెండు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. ముఖ్యంగా గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు మెరుపులతో కూడిన వానలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఏపీలోని దక్షిణ కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో కూడా ఇదే విధమైన పరిస్థితులు ఉండబోతున్నాయని వెల్లడించింది. వర్షాలు పడే అవకాశం ఉన్నప్పటికీ, కొన్ని చోట్ల వేడి, తేమతో కూడిన అసౌకర్య వాతావరణం కూడా కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.తెలంగాణ విషయానికి వస్తే... హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా ప్రకారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రాబోయే మూడు రోజులు అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. అయితే, గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో మాత్రం పెద్దగా మార్పు ఉండకపోవచ్చని, ఎండ తీవ్రత కొనసాగుతూనే మధ్యమధ్యలో వానలు పడతాయని అధికారులు తెలిపారు.

## కవిత కొత్త పార్టీకి
# ఈసీ గ్రీన్ సిగ్నల్..

**మొదటిపేజీ తరువాయి**

ఈ నెల 25న మేడ్చల్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో కవిత తన కొత్త పార్టీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ సభలో పార్టీ పేరును 'తెలంగాణ రాష్ట్ర సేన'గా వెల్లడించారు. అయితే, ఇప్పుడు కేంద్ర ఎన్నికల సంఘం ఆ పేరుకు బదులుగా 'తెలంగాణ రక్షణ సేన' పేరుకు ఆమోదం తెలిపింది.ఈ పేరును కవితకు కేటాయిస్తున్నట్లు ధృవీకరిస్తూ ఎన్నికల సంఘం పంపిన లేఖతో, ఆమె పార్టీకి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఒక కీలక ఘట్టం పూర్తయింది. ఈ అధికారిక ఆమోదంతో కవిత తన రాజకీయ కార్యకలాపాలను 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో ముందుకు తీసుకెళ్లనున్నారు.

# అమరావతిపై వైసీపీ దుష్ప్రచారాన్ని ఎదుర్కోండి

**మొదటిపేజీ తరువాయి**

అని స్పష్టం చేస్తూ, రాజధాని అమరావతిపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని దీటుగా ఎదుర్కోవాలని ఆదేశించారు.అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు వంటి భవనాలను ప్రపంచస్థాయి కట్టడాలుగా నిర్మిస్తున్నామని, ఇవి రాష్ట్రానికి గర్వకారణంగా మారుతాయని సీఎం తెలిపారు. ధరల విషయంలో ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలను వాస్తవాలతో సహా తిప్పికొట్టాలని సూచించారు. ఇంధన కొరత వంటి సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సాధారణ స్థితికి తెచ్చిందని గుర్తు చేశారు.రాష్ట్ర పాలనలో ఏఐ, ఐటీ వినియోగాన్ని పెంచాలని... మంత్రులు కూడా ఈ అంశాలపై అవగాహన పెంచుకోవాలని చంద్రబాబు సూచించారు. ఉద్యోగుల నియామకాల్లో కూడా ఏఐ పరిజ్ఞానాన్ని తప్పనిసరి చేయాలనే ఆలోచనను పంచుకున్నారు.కేవలం రాజకీయాలే కాకుండా, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఎండల దృష్ట్యా ప్రజలు ఇబ్బంది పడకుండా తాగునీరు, ముందస్తు జాగ్రత్తలపై దృష్టి సారించాలని మంత్రులను ఆదేశించారు. జలధార, జల హారతి, సూర్యఘర్ (ఇళ్లపై సోలార్) వంటి కార్యక్రమాల లక్ష్యాలను వేగంగా చేరుకోవాలని సూచించారు.

## తెలంగాణ డీజీపీ
# శివధర్ రెడ్డి పదవీ విరమణ

**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా శివధర్ రెడ్డి మాట్లాడుతూ... 1970-80ల నాటి కఠినమైన పోలీసింగ్ పద్ధతుల నుంచి నేటి ఆధునిక, సిటిజన్ ఫ్రెండ్లీ విధానాల వరకు సాగిన పరిణామ క్రమాన్ని గుర్తు చేసుకున్నారు. గతంలో పోలీసులపై ఉన్న అపవాదులను తుడిచివేసి, సామాన్య ప్రజలకు పోలీసులను దగ్గర చేయడంలో ఎంతో సాధించామని తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలతో ఏర్పడిన దూరాన్ని తగ్గించి, విశ్వసనీయతను పెంచామని చెప్పారుతన స్వరాష్ట్రానికి డీజీపీగా సేవ చేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా పోలీస్ శాఖను తీర్చిదిద్దిన తృప్తితో తాను విధులకు వీడ్కోలు పలుకుతున్నట్లు చెప్పారు. కొత్తగా బాధ్యతలు చేపడుతున్న సి.వి. ఆనంద్ ను ఒక సమర్థవంతమైన అధికారిగా ఆయన అభివర్ణించారు.

# ఏపీ టెన్త్ ఫలితాల విడుదల.. బాలికలదే పైచేయి

**మొదటిపేజీ తరువాయి**

**బాలికల హవా.. మెరుగైన ప్రభుత్వ పాఠశాలలు**

ఎప్పటిలాగే ఈసారి కూడా పదో తరగతి ఫలితాల్లో బాలికలు తమ సత్తా చాటారు. బాలికల ఉత్తీర్ణత శాతం 87.90% కాగా, బాలుర ఉత్తీర్ణత 82.68% వద్ద నిలిచింది. దీంతో బాలురపై బాలికలు స్పష్టమైన ఆధిక్యం కనబరిచారు. అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల పనితీరు కూడా మెరుగుపడింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఈసారి 78.39 % ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది(72.8%)తో పోలిస్తే ప్రభుత్వ బడుల్లో ఉత్తీర్ణత శాతం పెరగడం రాష్ట్ర విద్యావ్యవస్థకు సానుకూల సంకేతంగా భావిస్తున్నారు.

**మంత్రి లోకేశ్ ట్వీట్**

ఫలితాల విడుదల అనంతరం మంత్రి లోకేశ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్‌కు అభినందనలు తెలియజేస్తూ ప్రత్యేకంగా ట్వీట్ చేశారు. "ఈ ఫలితాలు మన విద్యార్థుల పట్టుదలను, ఉపాధ్యాయులు, కుటుంబాల బలమైన మద్దతును ప్రతిబింబిస్తాయి. విజయం సాధించిన వారందరికీ నా హృదయపూర్వక అభినందనలు. ఈసారి ఉత్తీర్ణత సాధించని వారు దయచేసి నిరాశ చెందవద్దు. ఫ్యామిలీ, ఉపాధ్యాయులు, సమాజం మద్దతుతో మీరు మరింత బలంగా తిరిగి వస్తారు. మన విద్యార్థులే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు వెన్నెముక, ప్రతి బిడ్డ విజయం సాధించేలా చూడటానికి మేము కట్టుబడి ఉన్నాము" అని లోకేశ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

**ఫలితాలు తెలుసుకోవడం ఎలా?**

విద్యార్థులు తమ ఫలితాలను పలు మార్గాల్లో సులభంగా తెలుసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అధికారిక వెబ్‌సైట్ తీవంబశ్రీం.ఎంవ.ఖజూ.స్త్రశీజ.ఱఅలో హాల్ టికెట్ నంబర్‌ను ఎంటర్ చేయడం ద్వారా ఫలితాలను పొందవచ్చు. అలాగే, ఈసారి 'మనమిత్ర' వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా కూడా ఫలితాలను పొందే సౌకర్యం కల్పించినట్లు మంత్రి లోకేశ్ వివరించారు. ఇవే కాకుండా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'హజూూ' మొబైల్ యాప్, కేంద్ర ప్రభుత్వ 'డిజిలాకర్' యాప్‌లలో కూడా విద్యార్థులు తమ మార్కుల వివరాలను చూసుకోవచ్చు.కాగా, ఏపీలో మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు పదో తరగతి పరీక్షలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 3415 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షలకు సుమారు 6.40 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 6,22,074 మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా, 18,842 మంది ప్రైవేట్‌గా పరీక్షలు రాశారు. ఫలితాల విడుదలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఉత్కంఠకు తెరపడినట్లయింది.

## రూపాయి చారిత్రక పతనం..
# 95 మార్కును దాటిన విలువ



**అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో భగ్గుమంటున్న చమురు ధరలు**

**రూపాయి పతనానికి ఫెడ్ నిర్ణయాలు కూడా ఓ కారణం**

**ఈ ఏడాదిలోనే 5.8 శాతం క్షీణించిన రూపాయి విలువ**

దేశీయ కరెన్సీ రూపాయి గురువారం భారీ పతనాన్ని నమోదు చేసింది. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ తొలిసారిగా 95 మార్కును దాటి చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అమెరికా, ఇరాన్ మధ్య తీవ్రమవుతున్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు విపరీతంగా పెరగడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ కఠిన వైఖరి వంటి అంశాలు రూపాయిని తీవ్ర ఒత్తిడిలోకి నెట్టాయి.గురువారం ఉదయం ట్రేడింగ్‌లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 95.07 వద్ద ఆల్-టైమ్ కనిష్ఠాన్ని తాకింది. ఆ తర్వాత మరింత బలహీనపడి ఇంట్రాడేలో 95.126 స్థాయికి, సెషన్ మధ్యలో 95.20 స్థాయికి కూడా పడిపోయింది. కేవలం ఈ ఏడాదిలోనే ఇప్పటివరకు రూపాయి విలువ సుమారు 5.8 శాతం మేర క్షీణించడం గమనార్హం.

**భగ్గుమంటున్న చమురు ధరలు**

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరడంతో ముడి చమురు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇరాన్‌కు చెందిన చమురు ట్యాంకర్లను స్వాధీనం చేసుకోవడం, నౌకా దిగ్బంధనాన్ని కొనసాగిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేయడంతో సరఫరాపై తీవ్ర ఆందోళనలు నెలకొన్నాయి. దీంతో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 120 డాలర్ల సమీపానికి చేరి, దాదాపు నాలుగేళ్ల గరిష్ఠ స్థాయికి ఎగబాకింది. ప్రస్తుతం బ్రెంట్ క్రూడ్ 114.10 డాలర్ల వద్ద, యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (ఔ×) క్రూడ్ 110.28 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి.

## 'టెన్త్'లో ఫలించిన లోకేష్ వ్యూహం..
# 100 రోజుల ప్లాన్ తో మెరుగైన ఫలితాలు

**నేడు ఏపీలో టెన్త్ ఫలితాలు విడుదల**

**విద్యాశాఖ అమలు చేసిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక**

**సమష్టి కృషితోనే మెరుగైన ఫలితాలు సాధించామన్న మంత్రి లోకేష్**

**గతేడాది 81.1% ఉత్తీర్ణత నమోదు కాగా, ఈసారి 85.25 శాతానికి చేరిక**

**ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఉత్తీర్ణత 72.8% నుంచి 78.39 శాతానికి మెరుగుదల**

**ఫలితాల్లో బాలుర కంటే బాలికలు 5.22 శాతం అధిక ఉత్తీర్ణత**

పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించడం అనేది ఐకమత్యంగా, అంకితభావంతో సాధించిన సమష్టి విజయమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇంకా సాధించాల్సింది చాలా ఉందని, అయితే అమలు చేసిన ప్రణాళికలు విజయవంతం కావడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల్లో నైతిక విలువలు, సమగ్ర వికాసం కోసం మరింత కృషి చేయనున్నట్లు తెలిపారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేస్తున్న కృషికి సమాజ సహకారం ఎంతో అవసరమని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేశారు. ఫెయిలైన వారు ఆత్మన్యూనతకు గురికావొద్దని, పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం సాధించవచ్చని భరోసా ఇచ్చారు.

**100-రోజుల కార్యాచరణ ప్రణాళిక**

"పూను స్పర్థలు విద్యలందే-వైరములు వాణిజ్యమందే" అనే గురజాడ మాటలను స్ఫూర్తిగా తీసుకుని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' మిషన్ ప్రారంభమైంది. ఇందులో భాగంగా రూపొందించిన '100-రోజుల కార్యాచరణ ప్రణాళిక' సత్ఫలితాలనిచ్చింది. 2025 డిసెంబర్ 6 నుంచి 2026 మార్చి 15 వరకు పకడ్బందీగా అమలు చేసిన ఈ ప్రణాళికలో, విద్యార్థులపై ఒత్తిడి లేకుండా 46 స్లిప్ టెస్టులు నిర్వహించారు. ఈ మార్కులను 'లీప్' మొబైల్ యాప్‌లో నమోదు చేసి, ప్రతిరోజూ 6 డ్యాష్‌బోర్డ్‌ల ద్వారా విశ్లేషించారు.

**షైనింగ్ స్టార్స్ .. రైజింగ్ స్టార్స్**

స్లిప్ టెస్టులలో విద్యార్థుల ప్రతిభ ఆధారంగా వారిని 'షైనింగ్ స్టార్స్', 'రైజింగ్ స్టార్స్'గా గుర్తించారు. వారి వారి సామర్థ్యాలకు అనుగుణంగా ప్రత్యేక బోధన అందించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

**సాధనే విజయం**

"సాధనమున పనులు సమకూరు ధరలోన" అన్న వేమన వాక్కును నిజం చేస్తూ, విద్యార్థులతో క్రమం తప్పకుండా సాధన చేయించడం వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఇందుకోసం విద్యాశాఖ ప్రత్యేకంగా మోడల్ పేపర్లు, క్వశ్చన్ బ్యాంకులను ఉచితంగా అందించింది. ముఖ్యంగా, నాన్-లాంగ్వేజ్ సబ్జెక్టుల కోసం ద్విభాషా (బై-లింగ్యువల్) పద్ధతిలో, ఒకవైపు తెలుగు మరోవైపు ఇంగ్లీషులో ప్రశ్నపత్రాలు రూపొందించి ఇవ్వడం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడింది.

**ఏ ఒక్క అవకాశం జారకుండా**

డ్యాష్‌బోర్డ్ విశ్లేషణ ద్వారా విద్యార్థుల బలాబలాలను ముందుగానే అంచనా వేశారు. దీనికి అనుగుణంగా ప్రతి పాఠశాలకు 15 కార్యాచరణ ప్రణాళిక పుస్తకాలను పంపిణీ చేశారు. స్లిప్ టెస్టులలో వెనుకబడిన విద్యార్థుల కోసం 30 రోజుల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌ను ప్రత్యేకంగా నిర్వహించి, వారిపై దృష్టి సారించారు. పరీక్షల ఒత్తిడిని తగ్గించేందుకు ప్రీ-ఫైనల్, గ్రాండ్ టెస్టులు నిర్వహించారు.

# ప్రభుత్వ బడి 'ఆణిముత్యం' అఫియా

❑ లక్ష్యం డాక్టర్.. సాధన అమోఘం!

ఇల్లందు ఏప్రిల్ 30 (జన సంఘర్షణ)

పట్టుదల ఉంటే ఆకాశమే హద్దు అని నిరూపించింది గోవింద్ సెంటర్ ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థిని ఎండి. అఫియా. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాలలో 541 మార్కులతో స్కూల్ సెకండ్‌గా నిలిచి, తన విజయ కేతనాన్ని ఎగురవేసింది. కేవలం మార్కుల వేటలోనే కాదు, విజ్ఞాన సముపార్జనలోనూ తను సాటిలేని మేటి అని ఈ ఫలితంతో స్పష్టమైంది. అఫియా సాధించిన ఈ విజయం కేవలం ఒక విద్యార్థిని గెలుపు మాత్రమే కాదు, ప్రభుత్వ పాఠశాలల్లోని నాణ్యమైన విద్యకు నిలువెత్తు నిదర్శనం. చిన్ననాటి నుంచే చదువులో విశేష ప్రతిభ కనబరుస్తున్న అఫియా, ఇప్పటికే ఎన్నో మెడల్స్, ప్రశంసా పత్రాలను తన ఖాతాలో వేసుకుంది. అయితే, తన అసలు లక్ష్యం కేవలం ర్యాంకులకే పరిమితం కాలేదు. "భవిష్యత్తులో వైద్యురాలిగా (ఐశీష్శీతీ) మారి సమాజానికి సేవ చేయడమే నా ఏకైక ఆశయం" అని అఫియా ధీమాగా చెబుతోంది. తెల్లకోటు ధరించి, రోగుల కష్టాలను తీర్చే ఒక బాధ్యతాయుతమైన డాక్టర్‌గా ఎదగాలన్న ఆమె సంకల్పం, పట్టుదలతో కూడిన ఆమె కళ్ళల్లో స్పష్టంగా కనిపిస్తోంది. అఫియా తల్లిదండ్రులు ఎండి షకీల్, ఎండి ఆయేషాల ఆనందానికి అవధులు లేవు. "ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్ల వారికి ఏమాత్రం తీసిపోరు" అని వారు గర్వంగా చెబుతున్నారు. వసతుల కంటే విద్యార్థిలోని తపన, ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఉంటే ఎలాంటి శిఖరాలనైనా అధిరోహించవచ్చని వారు ఈ సందర్భంగా గుర్తుచేశారు. తమ కుమార్తె ప్రతిభకు మెరుగులు దిద్ది, ఆమెను ఈ స్థాయిలో నిలబెట్టిన పాఠశాల ఉపాధ్యాయ బృందానికి వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ విజయం నేటి సమాజానికి ఒక గొప్ప సందేశాన్ని ఇస్తోంది. కార్పొరేట్ విద్యా సంస్థల ఆడంబరాల వెనక పరుగులు తీస్తున్న ఈ రోజుల్లో, ఒక సామాన్య ప్రభుత్వ పాఠశాల నుంచి అఫియా వంటి ప్రతిభావంతులు రావడం విశేషం. వనరులు తక్కువైనా, పట్టుదల మెండుగా ఉంటే పేదరికం గానీ, సామాజిక పరిస్థితులు గానీ ఎదుగుదలకు అడ్డంకి కావని అఫియా నిరూపించింది. డాక్టర్ కావాలనే ఆమె కల నిజమైతే, అది ఆమె కుటుంబానికే కాకుండా, ఆమె చదివిన బడికి, ఈ ప్రాంతానికి గర్వకారణం. చివరగా, అఫియా ప్రయాణం ఇక్కడితో ఆగిపోకూడదు. ఉన్నత చదువుల వైపు ఆమె వేస్తున్న అడుగులకు సమాజం, ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉంది. ఒక సామాన్య బాలిక అసాధారణ కలలు కనడం, వాటి కోసం శ్రమించడం చూస్తుంటే.. భవిష్యత్తు భారతం ఇలాంటి మేధావుల చేతుల్లో సురక్షితంగా ఉంటుందనిపిస్తోంది. తన అకుంఠిత దీక్షతో వైద్య రంగంలో అఫియా ఒక గొప్ప స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిద్దాం.





# హక్కుల రక్షణకై కదలండి: 140వ మేడేకు ఐఎఫ్టీయూ పిలుపు!

❑ కార్మిక హక్కులపై కన్నెర్ర: 'లేబర్ కోడ్స్' రద్దుకై ఐఎఫ్టీయూ సమరశంఖం!

ఇల్లందు ఏప్రిల్ 30 (జన సంఘర్షణ)

చికాగో అమరవీరుల పోరాట స్ఫూర్తితో మే 1న నిర్వహించనున్న 140వ మేడేను పురస్కరించుకుని, కార్మిక వ్యతిరేక విధానాలపై ఐఎఫ్టీయూ పోరాట జెండా ఎగురవేసింది. గురువారం ఇల్లెందు పరిధిలోని కొమ్ముగూడెం, కొమరారం, బొజ్జయిగూడెం సహా పలు ప్రధాన కేంద్రాల్లో నిర్వహించిన విస్తృత ప్రచారంలో నాయకులు పాల్గొని, కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల పోరాటంతో సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసేలా ఉన్న ఈ నూతన చట్టాలకు వ్యతిరేకంగా కార్మిక లోకం ఐక్యమవ్వాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. చరిత్రలో కార్మికులు రక్తం చిందించి సాధించుకున్న 8 గంటల పనిదినం, కనీస వేతనం వంటి హక్కులు నేడు ప్రమాదంలో పడ్డాయని సీనియర్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, హక్కుల పరిరక్షణ కోసం జరిగే మలిదశ ఉద్యమానికి మేడే నాంది కావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆటో, హమాలి, భవన నిర్మాణ గ్రామ పంచాయతీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని, తమ నిరసన గళాన్ని వినిపించారు. చెమట చిందించే ప్రతి చేయి.. దోపిడీకి వ్యతిరేకంగా ముష్టిఘాతమై కదలాలని, అప్పుడే శ్రమకు తగిన గౌరవం దక్కుతుందని నాయకులు స్పష్టం చేశారు.




# గిరిజన ఆరోగ్యంపై 'ప్రాధాన్య' నిఘా!

దుమ్ముగూడెం ఏప్రిల్ 30 (జన సంఘర్షణ)

దుమ్ముగూడెం అటవీ ప్రాంతాల్లోని గిరిజన బిడ్డలకు వైద్యం అందని ద్రాక్ష కావొద్దని, వ్యవస్థలో జవాబుదారీతనం పెరగాలని ఐటీడీఏ పీవో బి. రాహుల్ చేసిన ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఆశాకిరణంగా కనిపిస్తున్నాయి. ములకపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన, కేవలం రికార్డుల నిర్వహణకే పరిమితం కాకుండా, ఎండల తీవ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందుల లభ్యతపై అధికారులను నిలదీయడం గమనార్హం. గర్భిణీల విషయంలో 'నార్మల్ డెలివరీ' మంత్రాన్ని పఠించాలని సూచించడం వెనుక, మాతాశిశు మరణాల రేటును తగ్గించాలనే బలమైన సంకల్పం కనిపిస్తోంది. వైద్యంతో పాటు విద్య, క్రీడల అభివృద్ధి కోసం యంగ్ ఇండియా పాఠశాల, ఇండోర్ స్టేడియం పనులను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించడం చూస్తుంటే.. ఏజెన్సీ ప్రాంతాల్లో సమగ్ర వికాసం కేవలం ప్రసంగాలకు పరిమితం కాకుండా, కార్యాచరణ వైపు అడుగులు వేస్తోందని స్పష్టమవుతోంది. అధికారం కేవలం ఆదేశాలకే కాదు, అట్టడుగు వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికే అని ఈ పర్యటన మరోసారి గుర్తు చేస్తోంది.



# పోలీసు సేవలో 'అలుపెరగని ప్రయాణం'.. ఆరుగురు అధికారుల పదవీ విరమణ!

కొత్తగూడెం ఏప్రిల్ 30 (జన సంఘర్షణ)

శాంతిభద్రతల పరిరక్షణ కోసం సుమారు నాలుగు దశాబ్దాల పాటు నిరంతరం శ్రమించి, నేడు వృత్తి జీవితం నుండి విరమణ పొందిన ఆరుగురు పోలీసు అధికారులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఐదుగురు ఏఎస్ఐలు (బి. తాతారావు, టి. వెంకట్రావు, టి. వెంకట సుబ్బారావు, అబ్దుల్ ఘని, కొరసా నాగేశ్వరరావు), ఒక హెడ్ కానిస్టేబుల్ (బి. శ్రీరామ్) పదవీ విరమణ సందర్భంగా డిసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి, ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ సమక్షంలో వారిని శాలువాలతో, పూలమాలలతో ఘనంగా గౌరవించారు. ఖాకీ చొక్కా వెనుక ఉన్న బాధ్యతను సమర్థవంతంగా నెరవేర్చి, ప్రజల కోసం వెచ్చించిన వీరి సుదీర్ఘ అనుభవం యువ పోలీసులకు దిక్సూచి వంటిదని అధికారులు కొనియాడారు. సమాజం ప్రశాంతంగా నిద్రపోవడం కోసం దశాబ్దాల పాటు నిద్రలేని రాత్రులు గడిపిన ఈ 'అదృశ్య వీరులు', నేడు కుటుంబంతో కలిసి శేష జీవితాన్ని గడపనుండటం ఒక భావోద్వేగ క్షణం. పదవీ విరమణ కేవలం వృత్తికి మాత్రమే తప్ప, సేవకు కాదని.. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ యోగా, ధ్యానం ద్వారా ప్రశాంత జీవనం సాగించాలని ఈ సందర్భంగా అధికారులు ఆకాంక్షించారు. బాధ్యతను పూర్తి చేసి సగర్వంగా వీడ్కోలు తీసుకుంటున్న ఈ అధికారుల కృషి, పోలీసు శాఖ చరిత్రలో చెరగని ముద్రగా నిలిచిపోతుంది.




# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఫారెస్ట్ అధికారి

గుండాల ఏప్రిల్ 30 (జన సంఘర్షణ)

గుండాల మండలం నడిమిగూడెం ఫారెస్ట్ బీట్ అధికారి బానోతు నరేష్, గురువారం ఒక పోడు రైతు నుండి రూ. 10 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో ఈ మెరుపు దాడి జరిగింది.తన పని కోసం ఫారెస్ట్ అధికారి లంచం డిమాండ్ చేస్తున్నాడని బాధితుడైన పోడు రైతు ఏసీబీని ఆశ్రయించాడు.రైతు ఫిర్యాదుతో నిఘా పెట్టిన అధికారులు.. డబ్బులు తీసుకుంటున్న సమయంలోనే నరేష్‌ను పట్టుకున్నారు.మారుమూల గ్రామాల్లో అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా డీఎస్పీ రమేష్ హెచ్చరించారు. ప్రస్తుతం అధికారిని అదుపులోకి తీసుకున్న ఏసీబీ బృందం కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది.



# పరంజ్యోతి రావు మరణం తీరని లోటు: కాంగ్రెస్ నివాళి

కొత్తగూడెం ఏప్రిల్ 30 (జన సంఘర్షణ)

నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం తపించే ధీశాలి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ గిడ్ల పరంజ్యోతి రావు ఆకస్మిక మరణం కొత్తగూడెం నియోజకవర్గ రాజకీయాల్లో ఒక శూన్యాన్ని మిగిల్చింది. మాల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సామాజిక చైతన్యం కోసం నిరంతరం శ్రమించిన ఆయన, ఎంతటి క్లిష్ట సమస్యకైనా తన చతురతతో పరిష్కారం చూపడంలో సిద్ధహస్తుడని పార్టీ శ్రేణులు కొనియాడాయి. కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధిలో పరంజ్యోతి రావు ముద్ర చెరిగిపోనిదని, ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొంటూ నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, సీనియర్ నాయకులు నివాళులర్పించారు. మారుతున్న కాలంలో రాజకీయాలు అధికారం చుట్టూ తిరుగుతుంటే, ఆయన మాత్రం తుదిశ్వాస వరకు ప్రజల మధ్యే ఉండి 'పట్టుదలకు మారుపేరు'గా నిలిచారని, అటువంటి అంకితభావం గల నాయకుడిని కోల్పోవడం విచారకరమని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ టౌన్ ప్రెసిడెంట్ ఎం.ఏ. రజాక్, కాసుల వెంకట్, మాదా శ్రీరాములు, బండారి కోటేశ్వరరావు, మేకల నరసింగరావు, సామంతుల శంకర్, రేగళ్ల సకినాల వెంకన్న, కిస్తా కోటేశ్వరరావు తదితరులు పాల్గొని పరంజ్యోతి రావు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.



# జూనియర్ కాలేజీలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు నోటిఫికేషన్

ఇల్లందు ఏప్రిల్ 30 (జన సంఘర్షణ)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ (బాయ్స్-1)లో ఖాళీగా ఉన్న డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు భర్తీకి ప్రిన్సిపాల్ గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఏదైనా డిగ్రీతో పాటు పీజీడీసీఏ పూర్తి చేసి, పాఠశాలలు లేదా కళాశాలల్లో కనీసం మూడేళ్ల పని అనుభవం ఉన్న 18-35 ఏళ్ల మధ్య వయస్సు గల పురుష అభ్యర్థులు ఈ పోస్టుకు అర్హులు. ఎంపికైన వారికి నెలకు రూ.19,500 జీతం ఉంటుంది; ఆసక్తి గల వారు తమ సర్టిఫికెట్లతో మే 5వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు ఇల్లందు ఎంఆర్ఓ ఆఫీస్ పక్కన ఉన్న పాత సాధన డిగ్రీ కళాశాల ప్రాంగణంలో దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 9666286874 నంబర్‌ను సంప్రదించగలరు.




# మే 3న భారీ 'హిందూ సమ్మేళనం'.. విజయవంతం చేయాలని పిలుపు

భద్రాచలం ఏప్రిల్ 30 (జన సంఘర్షణ)

హిందూ సమ్మేళనం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మే 3న (ఆదివారం) సాయంత్రం 4 గంటలకు భద్రాచలం జూనియర్ కళాశాల మైదానంలో భారీ 'హిందూ సమ్మేళనం' నిర్వహించనున్నారు. ఈ మేరకు పట్టణంలోని టూరిజం హోటల్‌లో గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి కార్యక్రమ వివరాలను వెల్లడించారు. "గడప లోపల కులం.. గడప దాటితే మనమంతా హిందువులం" అనే నినాదంతో సమాజంలో ఐక్యత చాటడమే ఈ సమ్మేళనం ముఖ్య ఉద్దేశమని కమిటీ అధ్యక్షులు పాకాల దుర్గాప్రసాద్ తెలిపారు. ధార్మిక, సాంస్కృతిక విలువలను రక్షించుకోవడానికి భద్రాచలం, సారపాక, దుమ్ముగూడెం పరిసర ప్రాంతాల ప్రజలు అశేష సంఖ్యలో తరలిరావాలని శ్రీ శివనాగస్వామి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఎం.వి. సుబ్రహ్మణ్యం, నాగభూషణ శాస్త్రి, కుంజా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.




# భూభారతి సర్వేని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలి

❑ ఆర్డీఓ ప్రభాకర్

ఎల్లారెడ్డి, ఏప్రిల్ -30( జన సంఘర్షణ)

ఎల్లారెడ్డి మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గురువారం ఎల్లారెడ్డి ఆర్డిఓ ప్రభాకర్ గ్రామ సర్పంచ్ అయ్యల సాయిలు ఆధ్వర్యంలో భూభారతి భూసర్వే పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా స్థాయి సర్వే అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవో ప్రభాకర్ మాట్లాడుతూ వెంకటాపూర్ గ్రామం అటవీ ప్రాంతంతో అనుసంధానం ఉన్నందున ఈ గ్రామస్తులందరూ సహకరిస్తూ భూ భారతి సర్వే అవకాశాన్ని వినియోగించుకోవాలని రైతులకు పలు సూచనలు చేశారు. మారుమూల ప్రాంతం వెంకటాపూర్ గ్రామాన్ని భూ సమస్యలపై గ్రామానికి మ్యాప్ లేనందున ఈ సర్వేకు గ్రామస్తులందరూ సహకరించి గ్రామ శివారు హద్దులు గుర్తించి మన గ్రామాన్ని మ్యాపింగ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఆర్డిఓ ప్రభాకర్, తహసీల్దార్ ప్రేమ్ కుమార్, మండల డిప్యూటీ తహసిల్దార్ ఎంపీఓ ప్రకాష్ మండల సర్వేయర్ ఏపీవో వినోద్, జిపిఓ గంగారం,ఉప సర్పంచ్ మహేందర్, పంచాయతీ కార్యదర్శి గ్రామస్తులు పాల్గొన్నారు.



# రైతు ముంగిట భరోసా.. ఆడబిడ్డలకు అండగా 'ప్రజా ప్రభుత్వం'





ఇల్లందు ఏప్రిల్ 30 (జన సంఘర్షణ)

ప్రభుత్వ లక్ష్యం కేవలం పథకాల అమలు మాత్రమే కాదు, ఆ పథకాల ఫలాలు సామాన్యుడి గడప వరకు చేరడమేనని ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య స్పష్టం చేశారు. గురువారం బయ్యారం మండల కేంద్రంలో ఆయన సుడిగాలి పర్యటన చేస్తూ బహుళ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, రైతులు దళారుల ఉచ్చులో పడకుండా ప్రభుత్వ మద్దతు ధరను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంఆర్ఓ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 23 మంది లబ్ధిదారులకు రూ.23,00,116 విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెద్దన్నలా అండగా నిలుస్తోందని, నిధుల కొరత లేకుండా సంక్షేమాన్ని పరుగులు తీయిస్తున్నామని పేర్కొన్నారు. ఇదే క్రమంలో కొత్తగా నియమితులైన పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై.. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని దిశా నిర్దేశం చేశారు. ఒకవైపు అన్నదాతకు వెన్నుదన్నుగా నిలుస్తూనే, మరోవైపు ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, పాలనలో పారదర్శకత కోసం యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం.. ప్రజా ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మూల మధుకర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో అత్యంత నిబద్ధత కలిగిన అధికారి శ్యామ్ సుందర్ జాజు







హైదరాబాద్ సిటిబ్యూరో /ఏప్రిల్ 30( జనసంఘర్షణ )

తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ రాజ్ విధి నిర్వహణలో అత్యంత నిబద్ధత కలిగిన అధికారి శ్యామ్ సుందర్ జాజు అని తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ రాజ్ అన్నారు. గురువారం కార్మిక శాఖ డిప్యూటీ కమీషనర్ (రంగా రెడ్డి జిల్లా) శ్యామ్ సుందర్ జాజు పదవి విరమణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జనక్ రాజ్ మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా వంటి కీలక ప్రాంతంలో కార్మిక సమస్యల పరిష్కారంలో శ్యామసుందర్ జాజు చూపిన చొరవ అభినందనీయం. ఆయన పదవీ విరమణ శాఖకు తీరని లోటు అని పేర్కొన్నారు. కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ ఇ. గంగాధర్ మాట్లాడుతూ వృత్తిపరమైన బాధ్యతలతో పాటు మానవతా దృక్పథంతో నిర్ణయాలు తీసుకోవడం జాజు ప్రత్యేకత అని అన్నారు. చట్టంపై ఆయనకున్న పట్టు, సమస్యలను సామరస్యంగా పరిష్కరించే తీరు యువ అధికారులకు మార్గదర్శకం అని కొనియాడారు. జాయింట్ కమిషనర్ సునీత మాట్లాడుతూ క్లిష్టమైన పారిశ్రామిక వివాదాలను పరిష్కరించడంలో జాజు గారు ఎప్పుడూ ముందుండేవారని, సహచర అధికారులతో ఆయనకు ఉన్న సమన్వయం గొప్పదని అన్నారు. పదవి విరమణ చేసిన శ్యామసుందర్ జాజు మాట్లాడుతూ తన సుదీర్ఘ ప్రస్థానంలో సహకరించిన ఉన్నతాధికారులకు, తోటి సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్మిక శాఖలో పని చేయడం తనకు సంతృప్తిని ఇచ్చిందని భావోద్వేగానికి లోనయ్యారు. జాయింట్ కమీషనర్ అఫ్ లేబర్ (రంగారెడ్డి ) శ్యామ్ సుందర్ రెడ్డి, డిప్యూటీ కమీషనర్ లు బి జాసన్, జి.శ్రీనివాస్ గౌడ్, శ్యామ్ సుందర్ రెడ్డి, సునీత, రాజేంద్రప్రసాద్ సచివాలయ కార్యదర్శి సురేందర్ రెడ్డి సీనియర్ పాత్రికేయులు జూలూరి అఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తి-శాస్త్ర-శిల్ప సమ్మేళనం: శ్రీ వేదనారాయణ స్వామి దివ్యక్షేత్రం

- **మత్స్యావతార మహిమతో వెలుగొందుతున్న నాగలాపురం ఆలయం**

నాగలాపురం (జన సంఘర్షణ)

ఆధ్యాత్మికత, శిల్పకళ, శాజ్ఞానంతో నిండిన పవిత్ర క్షేత్రం నాగలాపురం. ఇక్కడ విరాజిల్లుతున్న శ్రీ వేదనారాయణ స్వామివారి ఆలయం భక్తులకు ఆధ్యాత్మికతను మరింత ప్రసాదించే దివ్యస్థలంగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయం పౌరాణిక వైభవంతో మరింతగా భక్తులను ఆకర్షిస్తోంది. ప్రతిరోజూ వివిధ రాష్ట్రాల నుండి వేలాది మంది భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుంటూ ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతున్నారు. ఇక్కడ జరుగుతున్న పూజలు, సేవలు భక్తుల్లో భక్తి భావాన్ని మరింతగా పెంపొందిస్తున్నాయి.

**మత్స్యావతార మహిమ**

సోమకాసురుడు వేదాలను అపహరించగా లోకం అజ్ఞానాంధకారంలో మునిగిపోయింది. దేవతల ప్రార్థనలతో శ్రీమహావిష్ణువు మత్స్యావతారాన్ని ధరించి అసురుని సంహరించి వేదాలను తిరిగి బ్రహ్మకు అందజేశాడు. ఆ దివ్య ఘట్టం జరిగిన ప్రదేశమే నాగలాపురమని భక్తుల విశ్వాసం. మహాలక్ష్మి, పరమేశ్వరుడు మత్స్యరూపంలోని శ్రీహరిని దర్శించారని చెప్పబడటంతో ఈ క్షేత్రం "హరికాంతపురం"గా ప్రసిద్ధి చెందింది.



**శిల్పకళా వైభవం**

పంచప్రాకారాలు, సప్తద్వారాలు, నాలుగు వైపులా గోపురాలతో ఆలయం అద్భుతంగా నిర్మించబడింది. పల్లవుల నిర్మాణ శైలి, శ్రీకృష్ణదేవరాయల అభివృద్ధి కలగలసి ఈ ఆలయాన్ని విశిష్టంగా నిలబెట్టాయి. నాలుగు ద్వారాలకు విభిన్న ద్వారపాలకులు ఉండటం అరుదైన విశేషం. ఉప ఆలయాల్లో లక్ష్మీనరసింహ, కోదండరామ, హయగ్రీవ స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు.

**సూర్యకిరణాల అద్భుతం**


ప్రతి సంవత్సరం సూర్యకిరణాలు గర్భగుడిలోని మూలవిరాట్‌ను తాకడం ఈ ఆలయ విశేషం. పాదాలు, నాభి, శిరస్సును వరుసగా స్పృశించే ఈ దివ్య దృశ్యం శిల్పవిజ్ఞానానికి నిలువెత్తు నిదర్శనం. ఈ ఘట్టాన్ని "సూర్యపూజోత్సవం"గా భక్తి భరితంగా నిర్వహిస్తారు.

**దివ్య దర్శనం**

మత్స్యనారాయణ స్వామివారి దర్శనం కేతు దోష నివారణకు, విద్యాభివృద్ధికి శ్రేయస్కరమని భక్తులు విశ్వసిస్తున్నారు. స్వామివారిని భక్తిశ్రద్ధలతో శరణు కోరిన వారికి శత్రు బాధలు తొలగుతాయని పురాణాలు తెలియజేస్తున్నాయి.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా శ్రీశ్రీ జయంతి వేడుకలు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ -30 (జన సంఘర్షణ)



ఆధునిక సాహిత్య యుగకర్త శ్రీ శ్రీ అని ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ 117వ జయంతి ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి కొత్త నడక నేర్పిన మహాకవి శ్రీశ్రీ ఆకాశం వెంట పయనించే తెలుగు కవిత్వాన్ని భూమార్గం పట్టించిన కవి అని, శ్రీశ్రీ కవిత్వానికి మానవుడే మకుటాయమానం మనిషి వికాసమే దేశ వికాసం అని ఆయన కవిత్వం చాటి చెబుతుందిఅన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకాంత్, అధ్యాపకులు శంకరయ్య, శివకుమార్, నాగానిక, అరుణ్ కుమార్, శశిధర్, కృష్ణ ప్రసాద్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 44 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఎల్లారెడ్డి, ఏప్రిల్ -30(జన సంఘర్షణ )




అక్రమంగా రవాణా చేస్తున్న 44 క్వింటల్లా పిడిఎఫ్ బిడియాన్ని గురువారం ఎల్లారెడ్డి పోలీసులు పట్టుకున్నారు. ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండలం, కేకే తండాకు చెందిన లావుడియా శ్రీనివాస్ అనే వ్యక్తి ఉప్పల్, హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ప్రజల వద్ద నుండి తక్కువ ధరకు పిడిఎస్ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, నిజామాబాద్ జిల్లా,బోధన్ ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నాడని పోలీసులకు సమాచారం మేరకు పట్టుకున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం 7 గంటల సమయంలో ఎల్లారెడ్డి పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, శివానగర్ ప్రాంతంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న శ్రీనివాస్‌ను పట్టుకున్నారు. అతనితో పాటు ఉన్న చరణ్ అనే వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో వ్యక్తి నరేష్ అక్కడి నుండి పారిపోయాడని అన్నారు. సుమారు 44 క్వింటాళ్ల పిడిఎస్ రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకకుని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు.

# ఇసుక 'రాంప్' రాజకీయం: అధికారుల నిర్లక్ష్యంపై ఎర్రజెండా కన్నెర్ర!

కొత్తగూడెం ఏప్రిల్ 30 (జన సంఘర్షణ)




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ సాక్షిగా గురువారం సిపిఐఎంఎల్ (మాస్ లైన్) ఆధ్వర్యంలో ఇసుక సొసైటీ సభ్యులు భారీ ధర్నా నిర్వహించారు. చర్ల మండలం చీమలపాడు, ఆర కొత్తగూడెం ఇసుక రాంపుల విషయంలో ప్రభుత్వ అధికారులు అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరి, పాత కమిటీలకు కొమ్ముకాస్తున్న తీరుపై పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కెచ్చెల రంగారెడ్డి నిప్పులు చెరిగారు. మహాజన సభల ద్వారా ఎన్నికైన నూతన కమిటీలకు అనుమతులు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ, పాత కమిటీ సభ్యులు కోర్టును తప్పుదోవ పట్టించి స్టే తెచ్చుకునేలా అధికారులు పరోక్షంగా సహకరించారని ఆయన విమర్శించారు. అధికారుల ఆలస్యమే నేడు గ్రామాల్లో ఇరు వర్గాల మధ్య రక్తపాతానికి దారితీస్తోందని, ఇప్పటికే ఆర కొత్తగూడెం ఘటనలో సభ్యులు గాయపడటమే దీనికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు రీచింగ్ కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం నిబంధనలను తుంగలో తొక్కుతూ, మరోవైపు పేద సొసైటీ సభ్యుల మధ్య చిచ్చు పెడుతున్న ఈ 'ఇసుక నీడ' రాజకీయం ఎటు దారితీస్తుందోనన్న ప్రశ్నలు ఇప్పుడు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా యంత్రాంగం మేల్కొని అక్రమార్కుల జోక్యాన్ని అరికట్టకపోతే, భవిష్యత్తులో జరిగే అవాంఛనీయ పరిణామాలకు అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని రంగారెడ్డి హెచ్చరించారు. ఈ నిరసనలో జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, సొసైటీ అధ్యక్షురాళ్లు ఇర్పా సామ్రాజ్యం, అశ్విని సహా వందలాది మంది కార్మికులు పాల్గొని తమ నిరసన గళాన్ని వినిపించారు.

# మొక్కజొన్న పంటకు అగ్నిప్రమాదం

ముధోల్, ఏప్రిల్ 30 (జన సంఘర్షణ)



ముధోల్ మండలం తరోడా గ్రామానికి చెందిన షేకిల్ ఖాన్‌కు చెందిన సుమారు 8 ఎకరాల మొక్కజొన్న పంట, అలాగే సికెందర్ అలీకి చెందిన 2 ఎకరాల మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ అగ్నిప్రమాదం సంభవించినట్లు రైతులు తెలిపారు. చేతికొచ్చిన పంట కళ్లముందే బూడిద కావడంతో బాధిత రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. పంట నష్టంతో తీవ్రంగా దెబ్బతిన్న రైతులు ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపరిహారం అందించాలని వేడుకుంటున్నారు.

# ఘనంగా అభినందన సభ




ముధోల్, ఏప్రిల్ 30 (జన సంఘర్షణ)

ముధోల్ లోని రబింద్రా ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యా ర్థులకు చాలా ఘనంగా సన్మానించారు. 550 కి పైన మార్కులు సాధించిన 34 మంది విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సాయినాథ్ మాట్లాడుతూ.. మా విద్యార్థులు 100% ఫలితంతో పాటు 500లకు పైగా 86 మంది విద్యార్థులు మార్కులు సాధించడం చాలా గర్వకారణమని ప్రతి సంవత్సరం ఇలాగే ఉత్తమమైన ర్యాంకులతో మా పాఠశాల ముందుకు దూసుకు వెళుతుందని సకల సౌకర్యాలతో ప్రత్యేకమైన విద్యను అందిస్తూ ఐఐటి నీట్ ఫౌండేషన్ కూడా స్థాపించి విద్యార్థులను గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యమని అన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి సహకారం అందించిన అందిస్తున్న ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు జీవితంలో అకుంఠిత దీక్షతో చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకుని, చదివిన పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులను సన్మానించారు కార్యక్రమానికి వచ్చిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ రాజేందర్, ఇన్చార్జిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రేంనగర్ లో నరసింహ స్వామి తీరు కళ్యాణం...

హైదరాబాద్ సిటీ బ్యూరో /ఏప్రిల్ 30 ( జనసంఘర్షణ )



శ్రీ నృసింహ జయంతి సందర్భంగా అంబర్పేట్ ప్రేంనగర్ లోని శ్రీ వీరా భయాంజనేయ స్వామి సహిత శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో అర్చకులు ఆచారి అత్రేయ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మి నృసింహ స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవం అంగ రంగా వైభవంగా ఆలయ అర్చకులు లక్ష్మణచార్యులు, ఆచార్య ఆత్రేయ, సునీల్ శర్మ కులకర్ణి నిర్వహించారు. ఆలయ కమిటి సభ్యులు మల్లేశం గుప్త, బాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ధన్ రెడ్డి, కస్తూరి లింగయ్య, తిరుపతి గుప్త, ప్రేందాస్, యాదగిరి, రమేష్, గోవర్ధన్ పాల్గొన్నారు. ఇందులో శ్రీరామ సేవకులు, శ్రీ రామ భక్త భజన మండలి వారు పాల్గొన్నారు.

## మండలంలో ప్రభుత్వం పాఠశాలల 10వ తరగతి ఫలితాలు

**సోమల, ఏప్రిల్ 29 (జనసంఘర్షణ):**
10వ తరగతి పరీక్షా ఫలితాలలో సోమల మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు మంచి ఫలితాలను సాధించి ప్రతిభను చాటుకున్నాయి. వివిధ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తీర్ణత శాతాన్ని పెంచడమే కాకుండా, అత్యుత్తమ మార్కులు సాధించి తమ పాఠశాలలకు గౌరవాన్ని తీసుకువచ్చారు. సోమల జడ్పీ ఉన్నత పాఠశాలలో మొత్తం 64 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 42 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పాఠశాలలో సి. వైష్ణవి 552 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచి పాఠశాల టాపర్‌గా నిలిచింది. నంజంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 59 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, వారిలో 47 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పాఠశాలలో టి నికిత, సి. చరిత 569 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచి అందరి ప్రశంసలు పొందారు. కందూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 94 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 84 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పాఠశాలలో జె. మణికంఠ అత్యుత్తమంగా 588 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచాడు. అంతేకాకుండా, మండల స్థాయిలో కూడా అతడు మొదటి స్థానాన్ని దక్కించుకున్నాడు. పెద్ద ఉప్పరపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 85 మంది విద్యార్థులకు గాను 66 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పాఠశాలలో సి. మేఘన 572 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. సూరయ్యగారి పల్లి జడ్పీహెచ్ ఉన్నత పాఠశాలలో 20 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 14 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పాఠశాలలో ఎస్. సబీబా 564 మార్కులు సాధించి మొదటి స్థానాన్ని పొందింది. ఈ ఫలితాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తూ, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలు సాధించాలని ఆకాంక్షించారు.

## చిరు వ్యాపారులకు ఉచిత తోపుడు బండ్లు పంపిణీ చేసిన మండల తెదేపా అధ్యక్షులు బి ఎం కిషోర్ గౌడు



**బైరెడ్డిపల్లి,ఏప్రిల్30 (జనసంఘర్షణ):**
బైరెడ్డిపల్లి మండలానికి చెందిన చిరు వ్యాపారులకు ప్రభుత్వం తరఫున గురువారం ఎంపిడిఓ కార్యాలయం వద్ద ఉచితంగా తోపుడు బండ్లను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బి ఎమ్ కిషోర్ గౌడు చేతుల మీదగా పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వ్యాపారులకు ఆర్థిక భారం తగ్గించి, రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే వారికి స్థిరమైన స్థలం కల్పించడం దీని యొక్క ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. పీఎం స్వనిధి పథకం కింద వీధి వ్యాపారులకు రూ. 10,000 నుండి రూ. 50,000 వరకు రుణాలు, రాయితీలు కల్పిస్తున్నారన్నారు. దుకాణాల అద్దెలు, అడ్వాన్సుల భారం తప్పుతుందన్నారు. స్వయం ఉపాధి పెరిగి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తాయిని తెలిపారు. నిరుపేదలు సొంత కాళ్లపై నిలబడటానికి సహాయపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో తెదేపా ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం శెట్టి, పలమనేరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు భువన చంద్ర గౌడు, సింగల్ విండో చైర్మన్ నాగరాజు నాయుడు,నాయకులు అల్లూరీ రాజేష్, ఏ ఓ ఆనంద బాబు తదితరులు పాల్గొన్నారు.

## అర్ధాంతరంగా షాపులకు తాళాలు వేయడం సరికాదు..

- మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి
- మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం.



**శ్రీకాళహస్తి ఏప్రిల్ 30 (జనసంఘర్షణ):**
పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్‌లో 24 రూములకు గత నాలుగు రోజులుగా మున్సిపల్ సిబ్బంది అర్ధాంతరంగా తాళాలు వేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆక్షేపించారు. "బాడుగలు చెల్లించని కారణంగా గానీ, మరే ఇతర కారణాలతోనైనా వ్యాపారులకు ముందుగా తెలియజేసి రికవరీ, జరిమానా విధించాల్సింది పోయి అర్ధాంతరంగా రూములకు తాళాలు వేయడం సరికాదు. వెంటనే రూములు వారికి అప్పగించి, నిల్వ బాకీలను వసూలు చేసుకోవాలి" అని డిమాండ్ చేశారు."మున్సిపల్ కమిషనర్ దీన్ని మీ బాధ్యతగా భావించాలి. రాజకీయాలకు మున్సిపల్ ఆఫీసును వేదికగా మార్చవద్దు ని నిరుపేదల పట్ల సానుకూలంగా వ్యవహరించి, వెంటనే షాపులను తెరిచి వ్యాపారులకు సహకరించాలి" అని కోరారు. ఈ కార్యక్రమంలో పగడాల రాజు, పఠాన్ ఫరీద్, శ్రీవారి సురేష్, పట్టణ అధ్యక్షులు ముని కృష్ణారెడ్డి,కంట ఉదయ్, మున్నా రాయల్, భరత్, జూమ్లేష, మొగరాల గణేష్, గోరా, పులి రామచంద్ర, డాక్టర్ శంకర్,అస్లాం, మాజీ కౌన్సిలర్ మహాభాష ,గౌస్ భాయ్,జుమ్లే షా భాయ్,ఆరిఫ్ భాయ్,రాజేంద్ర,వినోద్ ,కెంపల్లి మనోహర్,ఫాదర్ భాషా, సాదిక్, నరేంద్ర, రమేష్, దివ్యకాంత్ వైసీపీ శ్రేణులు, పాల్గొన్నారు.

## నవగ్రహ హోమంలో పాల్గొన్న శ్రీ ఇండస్ట్రీ అధినేత ఈశ్వర్ నాయుడు




**బంగారుపాలెం ఏప్రిల్ 30 (జనసంఘర్షణ):**
చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలం బొమ్మాయిపల్లి గ్రామంలో వెలసిన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం 43వ వార్షికోత్సవ వేడుకలో భాగంగా గురువారం ముందుగా గణపతి పూజ,నవగ్రహ హోమం,పూర్ణాహుతి అభిషేకాలు,ప్రత్యేక పూజలకు ఉభయధారులుగా శ్రీ ఇండస్ట్రీ అధినేత ఈశ్వర్ నాయుడు దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్ అభయ ట్రస్ట్ వ్యవస్థాపకులు వల్లేరు కళ్యాణ్, మాధవనాయుడు లు పాల్గొన్నారు.అనంతరం ఈశ్వర్ నాయుడు ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ధర్మకర్తలు శారదమ్మ, మల్లయ్య, కనకమ్మడ గోవిందయ్య, ముఖ్య కార్య నిర్వాహకులు కె.పట్టాభి, కె.మునస్వామి,కె.నారాయణస్వామి, కె.రవి, కె.రమేష్, కార్యనిర్వాహకులు శ్రీగౌరి యూత్,శ్రీరామ యువసేన,గ్రామస్తులు పాల్గొన్నారు.

# 'మే-డే' ను విజయవంతం చేద్దాం

- కార్మికులకు సిఐటియు పిలుపు
- మే 1న కార్మిక ఐక్యతను చాటుకుందాం
- సిఐటియు ప్రాంతీయ కార్యదర్శి ఎం. రమేష్

**సత్యవేడు ఏప్రిల్ 30 (జనసంఘర్షణ):**
అంతర్జాతీయ కార్మిక దినోత్సవం "మే- డే" ను విజయవంతంగా నిర్వహించాలని సత్యవేడు సిఐటియు ప్రాంతీయ కార్యదర్శి ఎం. రమేష్ కార్మికులకు పిలుపునిచ్చారు. మే 1న జరిగే మే డే వేడుకల్లో కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ కార్మిక ఉద్యమ చరిత్రలో మే డేకు విశిష్ట స్థానం ఉందన్నారు. ఈ ఏడాది 140వ మే డేను కార్మిక హక్కుల పరిరక్షణ, కార్మిక ఐక్యతకు ప్రతీకగా జరుపుకోవాలని సూచించారు. కార్మికులందరూ తమ తమ సంఘాలతో కలిసి ఈ దినాన్ని దీక్షా దినంగా పాటించాలని పిలుపునిచ్చారు. కార్మిక హక్కులను కార్పొరేట్ అనుకూలంగా మార్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఎనిమిది గంటల పని దినాన్ని కాపాడాలని, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అలాగే, 12వ పీఆర్సీ



కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ముఠా, హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని, సామాజిక సమానత్వం, లౌకిక విలువలను పరిరక్షించాలని అన్నారు. కార్మిక హక్కుల సాధన కోసం కార్మికులందరూ ఐక్యంగా ముందుకు రావాలని, మే డే స్ఫూర్తిని కార్యరూపంలో చూపాలని ఎం. రమేష్ పిలుపునిచ్చారు.

# తప్పిపోయిన వృద్ధురాలు బంధువులకు అప్పగింత

- తిరుమల దర్శ నానికి వచ్చి తప్పిపోయిన పెద్దావిడ.

**మనుబోలు. 30.4.2026 (జనసంఘర్షణ):**
చెన్నై కలకత్తా 16 నంబరు జాతీయ రహదారిపై దారితప్పిన వచ్చిన ఓ వృద్ధ మహిళను పోలీసులు కాపాడారు. గుర్తుతెలియని మహిళ దగ్గర ఉన్న ఆధార్ కార్డు ద్వారా బెంగళూరులో ఉన్న బంధువులకు సమాచారం ఇచ్చి ఆమెనుకుటుంబ సభ్యులు కు అప్పగించారు. దీనికి సంబంధించిన పూర్వపరాలు ఈ విధంగా ఉన్నాయి. జాతీయ రహదారిపై సంచరిస్తున్న వృద్ధురాలు పైగా మాటలు రాని మూగావిడను హైవే మొబైల్ హెడ్ కానిస్టేబుల్ మస్తానయ్య మురళి గమనించారు. ఆమె వాలకం చూసి ఈమె ఇక్కడ తిరిగితే ప్రమాదం పొంచి ఉందని హైవే మొబైల్ లో ఎక్కించుకొని పోలీస్ స్టేషన్ తీసుకువచ్చారు. ఆమె దగ్గర ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా కర్ణాటక చెందిన దుర్గా కవల్కర్ తెలుసుకున్నారు. కర్ణాటకలో ఉన్న పోలీసులకు ఈ విషయం చెప్పారు. కర్ణాటక పోలీసులు ఆమెనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆమె బంధువులు మనుబోలు పోలీస్ స్టేషన్ వచ్చి దుర్గనుగురు వారం తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు తిరుమలకు దర్శనాలకు వచ్చి ఆమె తప్పిపోయారు. తిరుమల నుండి ఇక్కడికి ఎలా వచ్చిందో మొత్తానికి ఆమె టైం బాగుండి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్షేమంగా పోలీసులు సహాయంతో కుటుంబ సభ్యులు చేరుకున్నారు. దుర్గాను కాపాడిన పోలీసులకు కర్ణాటక దుర్గా బంధువులు థాంక్స్ చెప్పారు. హైవే మొబైల్ హెడ్ కానిస్టేబుల్ మస్తానయ్య మురళి ని పలువురు అభినందించారు.



# శాస్త్రోక్తంగా శ్రీ వేదనారాయణస్వామివారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- మే 1న ధ్వజారోహణం
- మే 1 నుండి 9 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు

**తిరుపతి/ ఏప్రిల్ 30, (జనసంఘర్షణ):**
నాగలాపురంలోని శ్రీ వేదనారాయణస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ ఘట్టం భక్తి వైభవంతో ఘనంగా నిర్వహించారు. వేదఘోషల మధ్య నిర్వహించిన ఈ పవిత్ర కార్యక్రమం ఆలయాన్ని ఆధ్యాత్మిక కాంతులతో అలంకరించింది. ఈ సందర్భంగా తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమలసేవ, అర్చన వంటి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం జరిపి, బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ శాస్త్రోక్తంగా చేపట్టారు.

**ధ్వజారోహణంతో ఉత్సవాలకు శ్రీకారం**

మే 1న ఉదయం మేష లగ్నంలో ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఉదయం 4.30 నుండి 5.30 గంటల వరకు తిరుచ్చి ఉత్సవం, 5.30 నుండి 6.30 గంటల మధ్య ధ్వజారోహణం నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం, రాత్రి వాహన సేవలు, స్నపన తిరుమంజనం, ఊంజల్ సేవలు నిర్వహించి భక్తులకు దివ్యానుభూతిని కలిగించనున్నారు.

**బ్రహ్మోత్సవాల ప్రధాన కార్యక్రమాలు**

01-05-2026 ఉదయం ధ్వజారోహణం, రాత్రి - పెద్దశేష వాహనం
02-05-2026, ఉదయం - చిన్నశేష వాహనం, రాత్రి - హంస వాహనం
03-05-2026 ఉదయం --సింహ వాహనం రాత్రి - ముత్యపుపందిరి వాహనం
04-05-2026ఉదయం - కల్పవృక్ష వాహనం రాత్రి - సర్వభూపాల వాహనం
05-05-2026 ఉదయం - మోహినీ అవతారం రాత్రి - గరుడ వాహనం 06-05-2026 ఉదయం - హనుమంత వాహనం
రాత్రి - గజ వాహనం 07-05-2026 ఉదయం - సూర్యప్రభ వాహనం
రాత్రి -- చంద్రప్రభ వాహనం 08-05-2026. ఉదయం - రథోత్సవం సాయంత్రం - ఆర్జిత కల్యాణోత్సవం
రాత్రి శ్వవాహనం 09-05-2026ఉదయం - చక్రస్నానం సేవలు సహ విస్తృత ఏర్పాట్లు చేపట్టారు.

టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ హరికథలు, భజనలు, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ భక్తి కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మిక ఆనందసంద్రంలో ముంచెత్తనున్నాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, ప్రధాన అర్చకులు శ్రీ నాగరాజ భట్టాచార్యులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, చెంగల్ రాయులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటాం

- ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి

**కోట ఏప్రిల్ 30 (జనసంఘర్షణ):**
కోట పట్టణం నందు మార్నింగ్ వాక్ వెళ్తున్న ఆంధ్రజ్యోతి రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డిని రౌడీషీటర్ తమిమ్ అత్యంత దారుణంగా హత్య చేయడంతో పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతికి విఘాతం కల్పించే చర్యలను ప్రభుత్వం సహించదని, ప్రశాంతంగా ఉండే వీకోటలో పట్టపగలు ఇలాంటి అమానుష చర్య జరగడం అత్యంత దురదృష్టకరమని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఇటువంటి హింసాత్మక ఘటనలు సమాజానికి పెనుముప్పు అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ముఖ్యమంత్రిని, హోం మంత్రిని కోరానని వారు సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. తప్పకుండా బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందని,నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని చట్టపరంగా వారికి కఠిన శిక్షలు పడే విధంగా చూడాలని అధికారులును ఆదేశించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. మీ కుటుంబానికి నేను ఎప్పుడు అండగా ఉంటానని, ఏ అవసరం వచ్చినా నన్ను సంప్రదించవచ్చునని హామీ ఇచ్చారు. చెడు పురుగులను సమాజం నుండి ఏరి వేయకపోతే శాంతి భద్రతకు విగాథం కలుగుతుందని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్య తీసుకుంటుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం చట్టపరంగా తీసుకోవాల్సిన అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఎమ్మెల్యే వెంట రామచంద్ర నాయుడు, రంగనాథ్, రాంబాబు, ధీరజ్, నారాయణస్వామి, హరినాథ్ రెడ్డి, లక్ష్మణ్, డీఎస్పీ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.



# పిచ్చాటూరు మండలంలో 24 గంటలు విద్యుత్ సరఫరా...

**తిరుపతి ఎస్ ఈ చంద్రశేఖర రావు**

**పిచ్చాటూరు (జనసంఘర్షణ):**
పిచ్చాటూరు మండలంలో 24 గంటలు అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా అందించడానికి స్థానిక సబ్ స్టేషన్ నందు తిరుపతి ఎస్ ఈ చంద్రశేఖర రావు వారిచేత ఆర్ డి ఎస్ ఎస్ 24 గంటలు ఫీడర్ ట్రాన్స్ఫార్మర్ చార్జింగ్ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ఇకమీదట గ్రామాల్లో కరెంటు కోత ఉండదని 24 గంటలు మండలంలో అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా అందిస్తామని అందుకోసం సబ్ స్టేషన్ నందు ట్రాన్స్ఫార్మర్ చార్జింగ్ చేశామని తెలిపారు ఈ కార్యక్రమంలో పుత్తూరు ఈ ఈ దేవాశీర్వాదం, నాగలాపురం డిప్యూటీ ఈ వెంకటరమణ, ఏఈ రాజ్ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.



జన సంఘర్షణ
శుక్రవారం
01 మే 2026

# పది ఫలితాలలో రాజు విద్యాసంస్థల విద్యార్థులదే హవా...

- 595 మార్కులు సాధించిన రాజుల సిరి
- అభ్యాసం, అంకితభావమే విజయానికి సోపానాలు..
- ఇష్టంతో కష్టపడి చదివినప్పుడే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చు...
- రాజు విద్యాసంస్థల కార్యదర్శి చమర్తి లోకేష్ రాజు..

**తిరుపతి, ఏప్రిల్ 30 జన సంఘర్షణ:** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో తిరుపతి న్యూ బాలాజీ కాలనీలో నీ రాజు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించి విజయదుందిబీ మోగించారు. రాజు విద్యాసంస్థలో మొత్తం 71 మంది పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాశారు. 71 మంది విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించారు. వారిలో 62 మంది విద్యార్థిని విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. వారిలో ఎస్ రాజుల సిరి అనే విద్యార్థిని 600 గాను 595 మార్కులు సాధించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారు. అలాగే ఏ మనోహరి 593, బి పూర్విక 592, ధాత్రిక 591, విశ్వ సౌజన్య 591మార్కులు సాధించి తిరుపతి జిల్లాలో విజయదుంది బి మోగించారు. 100% ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను రాజు విద్యాసంస్థల కార్యనిర్వాక కార్యదర్శి చమ్మర్తి లోకేష్ రాజు అభినందించారు. శుక్రవారం సాయంత్రం రాజు విద్యాసంస్థలలో పదిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ రాజు విద్యాసంస్థల జోనల్ హెడ్ విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు రెడ్డప్ప, అలెన్ హెడ్ సూర్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం లోకేష్ రాజు మీడియాతో మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావం తల్లిదండ్రుల సహకారంతో విద్యార్థులు ఇష్టపడి చదివినప్పుడే అనుకున్న ఫలితాలు సాధించవచ్చునని చెప్పారు. మా రాజు విద్యాసంస్థలలో క్రమశిక్షణతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత బోధనలను చెప్పించడంతోపాటు వీక్లీ టెస్టులు నిర్వహించడం, వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి వారికి కూడా మంచి మార్కులు సాధించేలా చేయడమే రాజు విద్యాసంస్థల లక్ష్యమని చెప్పారు. తిరుపతిలో రాజు విద్యాసంస్థలను స్థాపించిన నాటి నుండి ప్రతి సంవత్సరం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో 100% ఫలితాలు సాధిస్తూ జిల్లాలో తమ విద్యా సంస్థ ప్రత్యేక గుర్తింపుకు నోచుకుందని చెప్పారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత చదువులలో మంచి ఫలితాలు సాధించి అటు తల్లిదండ్రులకు విద్యాసంస్థలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని లోకేష్ రాజు ఆకాంక్షించారు. రాజు విద్యాసంస్థలలో క్రమశిక్షణతో పాటు అధునాతన బోధనలతో విద్యను బోధించడంతోపాటు మంచి ఫలితాలు సాధించడమే ధ్యేయమని పేర్కొన్నారు.




# సీసీటీఎంఎం : డేటా ఎంట్రీపై దిశా నిర్దేశం

- స్టేషన్ రైటర్లు, ఆపరేటర్లు, సబ్-డివిజన్ కార్యాలయ రైటర్లతో జిల్లా-జిల్ల ఎస్పీ సమీక్ష.
- స్మార్ట్ పోలీసింగ్‌లో భాగంగా జజుచీూ డేటా ఎంట్రీపై దిశా నిర్దేశం.
- ఎప్పటికప్పుడు ఖచ్చితమైన డేటా నమోదు చేయాలని ఆదేశాలు.

**తిరుపతి/ జన సంఘర్షణ/ ఏప్రిల్ 30**

తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపిఎస్. స్మార్ట్ పోలీసింగ్‌లో భాగంగా, జిల్లావ్యాప్తంగా స్టేషన్ రైటర్లు, సీసీటీఎంఎం ఆపరేటర్లు, సబ్–డివిజన్ కార్యాలయ రైటర్లకు పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, వ్యవస్థలో వివిధ అంశాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు నవీకరన మరియు నమోదు చేయడం అత్యంత కీలకమని తెలిపారు. డేటా ఎంట్రీలో నిర్లక్ష్యం, అసంపూర్ణ లేదా తప్పు నమోదు చేయడం వల్ల జిల్లా ప్రతిష్ట దెబ్బతింటుందని హెచ్చరిస్తూ, ప్రతి అంశాన్ని జాగ్రత్తగా క్షుణంగా పరిశీలించి నమోదు చేయాలని ఆదేశించారు. సిబ్బంది తమ పనితీరును మెరుగుపరుచుకుని, సమన్వయంతో పనిచేస్తే జిల్లాకు మంచి ర్యాంకింగ్ సాధ్యమవుతుందని తెలిపారు. ఎక్కడైనా సాంకేతిక లేదా విధానపరమైన సమస్యలు ఎదురైతే వెంటనే పై అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. తదుపరి ఉత్తమ పనితీరు కనబరిచిన స్టేషన్లను అభినందిస్తూ, ప్రతి నెల పనితీరు ఆధారంగా రివార్డులు అందజేయబడతాయని ప్రకటించారు. అనంతరం రికార్డుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ స్టేషన్లకు రివార్డులు అందజేశారు. సిసిఎస్ తిరుపతి మొదటి స్థానం, తిరుమల వన్ టౌన్ రెండవ స్థానం, మహిళా పోలీస్ స్టేషన్ మూడవ స్థానం, ఎర్రవారిపాల్యం నాలుగవ స్థానం, బాలయ్యపల్లి ఐదవ స్థానం నిలిచాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీ వెంకటరావు (పరిపాలన), ఎస్‌బి డియస్పి, గీతా కుమారి, డిసిఆర్‌బి డియస్పి శ్రీ రమణ, సీఐలు, ఎస్‌బి శ్రీ విక్రమ్ , డిసిఆర్‌బి రవీంద్రనాథ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# సత్తా చాటిన సూళ్లూరుపేట హోలీ క్రాస్ 10 వ తరగతి విద్యార్థులు

- పదవ ఫలితాల్లో టౌన్ ఫస్ట్, స్టేట్ ర్యాంక్ సాధన

**సూళ్లూరుపేట ఏప్రిల్ 30 గురువారం జన సంఘర్షణ**

సూళ్లూరుపేట మండల పరిధిలోని పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో హోలీ క్రాస్ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి మరోసారి తమ ప్రతిష్టను చాటుకున్నారు. కరస్పాండెంట్/ప్రిన్సిపాల్ ఎస్. జాన్ పీటర్ హెచ్‌ఎం ఏ. షీలా మేడం సమర్థ నాయకత్వంలో, ఉపాధ్యాయుల నిరంతర శ్రమ, మార్గదర్శకత్వం, విద్యార్థుల కృషి కలగలిపి ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయి. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన ప్రతిభావంతురాలు వై. అపూర్వ 596 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ ర్యాంక్‌తో పాటు స్టేట్ స్థాయిలోనూ అత్యున్నత ర్యాంక్ సాధించడం విశేషం. ఆమె ఈ విజయంతో పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచింది. చిన్నప్పటి నుంచే క్రమశిక్షణతో చదువుతూ, ఉపాధ్యాయుల సూచనలను పాటిస్తూ ముందుకు సాగిన అపూర్వ, ఈ ఫలితంతో తన ప్రతిభను మరోసారి నిరూపించింది. ఇక ఇతర విద్యార్థులు కూడా అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాలకి మంచి పేరు తీసుకువచ్చారు. ఎక్కువ శాతం మంది విద్యార్థులు డిస్టింక్షన్ సాధించగా, 100% ఉత్తీర్ణత సాధించడం పాఠశాల ప్రత్యేకతగా నిలిచింది.

విద్యార్థుల ఈ ఘన విజయంపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆశీర్వదించారు. అలాగే ఈ ఫలితాలకు కారణమైన తల్లిదండ్రుల సహకారం కూడా కీలకమని తెలిపారు. ఈ విజయాన్ని పురస్కరించుకొని పాఠశాలలో ప్రత్యేక అభినందన కార్యక్రమం నిర్వహించేందుకు యాజమాన్యం ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. హోలీ క్రాస్ పాఠశాల విద్యార్థుల ఈ ప్రదర్శన స్థానికంగా ప్రశంసలు అందుకుంటూ, ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తోంది.



# సీఎంఆర్ఎఫ్‌తో పేద ప్రజలకు ఆరోగ్య రక్ష: ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

- ఒకే రోజు 68 మందికి 69 లక్షలు అందజేత
- అర్హులకు చెక్కులు అందజేసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

**నెల్లూరు జిల్లా-జన సంఘర్షణ**

సీఎంఆర్ఎఫ్ నిధులతో రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్య రక్షణకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం నగరంలోని విపిఆర్ క్యాంపు కార్యాలయంలో 68 మంది లబ్ధిదారులకు 69 లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు. ఇందులో ఎంపీ పరిధిలో 7 మందికి 5 లక్షలు, ఎమ్మెల్యే పరిధిలో 61 మందికి 64 లక్షలు అందించారు. ఎంపీ, ఎమ్మెల్యే పరిధిలో ఇప్పటివరకు దాదాపు 10 కోట్ల విలువైన చెక్కులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు కోట్లాది రూపాయల సీఎంఆర్ఎఫ్ నిధులు ఇస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్టానికి చంద్రబాబు నాయుడు లాంటి మానవతావాది ముఖ్యమంత్రిగా ఉండటం ప్రజల అదృష్టంగా అభివర్ణించారు. పేద కుటుంబాలలో ఎవరికైనా పెద్ద జబ్బు చేసి ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోతే నేనున్నానంటూ సీయంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నారని చెప్పారు. 23 నెలల కాలంలోనే కోవూరు నియోజకవర్గంలో 804 మంది బాధితులకు 8.47 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందచేశామన్నారు. పేదల గుండెల్లో ధైర్యాన్ని నింపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలియచేసారు.





## మే 1 నుండి 31 లోపు ఇంటి పన్ను చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ.... మండల ఎంపీడీవో సురేంద్రనాథ్.

**తొట్టం బేడు ఏప్రిల్ 30 జన సంఘర్షణ:** శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండల పరిధిలోగల గ్రామ ప్రజలకు,వ్యాపార సంస్థలకు ఫ్యాక్టరీ యజమానులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంచాయితీ రాజ్ శాఖ వారు 2026–27 ఆర్థిక సంవత్సరం పన్ను చెల్లింపుదారులకు స్వర్ణ పంచాయితీ పోర్టల్ నందు ఇంటి పన్నును మే 1 నుండి 31 లోపు చెల్లించిన వారికి ఇంటి పన్ను లో 5%(ఐదు శాతం) రాయితీ ప్రకటించినది. అందుకు సంబంధించిన ఇంటి పన్ను డిమాండ్ లు కూడా యజమానుల మొబైల్ నెంబర్ కు పంపించడం మైనది, ఈ సందర్భంగా చెక్కు, డిడి ల ద్వారా కూడా ఇంటి పన్నును చెల్లించవచ్చును మండల ఎంపీడీవో సురేంద్రనాథ్ తెలిపారు,ఈ అవకాశం మండలంలోని ఇంటి పన్ను,ప్రాపర్టీ టాక్స్ చెల్లింపు దారులు ఉపయోగించుకుని గ్రామపంచాయతీ అభివృద్ధిలో పాలుపంచుకోవలసినదిగా కోరారు.



## అగ్ని ప్రమాద ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

**వి కోట ఏప్రిల్ 30 ,జన సంఘర్షణ**

మండల కేంద్రం మైన వీకోటలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనా స్థలాన్ని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథరెడ్డి గురువారం పరిశీలించారు. వి.కోటకు చెందిన చేతన్ రాథోడ్ నిర్వహిస్తున్న ఆదర్శ్ మార్కెటింగ్ పివిసి పైపుల గోడౌన్ ప్రమాదవశాత్తు అగ్నికి అహుతి అయింది. ఈ ప్రమాదంలో సుమారు 2 కోట్లు విలువచేసే ఆస్థి నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఎమ్మెల్యే ఎదుట కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రమాదానికి గల కారణాలు తెలియ రాలేదని తనకు న్యాయం జరిగేలా చూడాలని బాధితుడు కోరారు. ప్రమాద సంఘటనపై విచారణ జరిపి బాధితునికి న్యాయం జరిగేలా చూడాలని స్థానిక పోలీస్ అధికారులకు ఎమ్మెల్యే ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.





# సీనయ్య చిరస్మరణీయుడు

**కోట ఏప్రిల్ 30 జన సంఘర్షణ**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ : రాష్ట్ర రాజకీయ చరిత్రలో చిరస్మరణీయ స్థానాన్ని సంపాదించుకున్న మహానేత, పేదల పక్షపాతి, ప్రజాహితం కోసం నిరంతరం కృషి చేసిన మహోన్నత వ్యక్తిత్వంగల నాయకుడు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి జయంతి సందర్భంగా ఆయనకు మనస్ఫూర్తిగా వినమ్ర నివాళులు అర్పిస్తూ గ్రామీణ ప్రజల హృదయాలను గెలుచుకున్న ఆయన, పదవులు అలంకరించిన నేత మాత్రమే కాదు – ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన నిజమైన సేవకుడు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రతి ఒక్కరిని పేరుపెట్టి పలకరించే ఆత్మీయత, అందరినీ తన కుటుంబ సభ్యుల్లా చూసే మనసు ఆయన ప్రత్యేకత. రాజకీయాల్లో ఉన్నత స్థానాలకు ఎదిగినా, సాధారణ ప్రజల బాధలను తనవిగా భావించి, వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేయడం ఆయన గొప్పతనం.అభివృద్ధి ప్రదాతగా ఆయన చేసిన సేవలు ఎన్నో తరాలకు ఆదర్శం.జై విద్య, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో ఆయన చూపిన దూరదృష్టి ఇప్పటికీ ప్రజల మదిలో నిలిచివుంది. అసెంబ్లీలో ఆయన ధైర్యవంతమైన స్వరం, ప్రజా సమస్యలపై ఆయన పోరాటం ఆయనకు "అసెంబ్లీ టైగర్" అనే గౌరవాన్ని తెచ్చిపెట్టాయి. నిజాయితీ, నిబద్ధత, ధైర్యం కలగలిపిన నాయకత్వం ఎలా ఉండాలో ఆయన జీవితం ద్వారా మనకు స్పష్టంగా తెలుస్తుంది. ది లెజెండ్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్" అని ప్రజలు ప్రేమతో పిలుచుకునే ఈ మహానేత, తన జీవితాన్ని ప్రజల కోసం అంకితం చేసి, నాయకత్వానికి కొత్త నిర్వచనం ఇచ్చారు. ఆయన చూపిన మార్గం యువతకు ప్రేరణ, ప్రజా సేవకు మార్గదర్శకం. వారి జయంతి సందర్భంగా ఆయన ఆశయాలను స్మరించుకుంటూ, ఆయన చూపిన సేవామార్గంలో నడవాలని ప్రతి ఒక్కరం సంకల్పించుకుందాం. శ్రీ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి స్ఫూర్తి మనకు ఎప్పటికీ దారిదీపంగా నిలుస్తుంది. "ప్రజలే దేవుడు" అనే భావంతో సేవ చేసిన మహానేతకు శత సహస్ర వందనాలు.



## గోవిందరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన.. గంధమనేని

**జన సంఘర్షణ:** ఎస్ఆర్ పురం మండలం వేణు గోపాలపురం గ్రామానికి చెందిన గోవిందరెడ్డి కర్మ క్రియలు సందర్భంగా గోవింద్ రెడ్డి చిత్రపటానికి ఎస్ఆర్ పురం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు ఎస్ ఆర్ పురం సహకార సంఘ చైర్మన్ నిరంజన్ రెడ్డి నివాళులర్పించారు.. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మణి, డీలర్ల సంఘం అధ్యక్షుడు జయరాం నాయుడు టిడిపి నాయకులు పాల్గొన్నారు



# జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో జరిగిన పదవి విరమణ సన్మాన కార్యక్రమం..

**తిరుపతి/ఏప్రిల్ 30, జన సంఘర్షణ**




జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపిఎస్., దీర్ఘకాల సేవలందించిన అధికారులను, సిబ్బందిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొని ఆనందాన్ని పంచుకున్నారు. పోలీస్ శాఖకు వారు అందించిన సేవలు, క్రమశిక్షణ, నిబద్ధతను ఉన్నతాధికారులు ప్రశంసించారు. జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఐపీఎస్. మాట్లాడుతూ.. పోలీస్ సేవ అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాకుండా సమాజానికి అంకితమైన సేవ అని, ప్రజల భద్రత కోసం చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని తెలిపారు. పోలీస్ శాఖ తరపున రిటైర్ అవుతున్న సిబ్బందికి ధన్యవాదాలు, అభినందనలు తెలియజేసి, వారి సేవలకు కుటుంబ సభ్యుల సహకారం ప్రశంసనీయం అని పేర్కొన్నారు.వారి నిబద్ధత, క్రమశిక్షణ యువ పోలీస్ సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తుందని, రిటైర్మెంట్ అనంతరం కూడా సమాజానికి మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు. రిటైర్మెంట్ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సంతోషంగా జీవించాలని ఆకాంక్షిస్తూ, శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. ప్రభుత్వం, పోలీస్ శాఖ మీ సేవలకు ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉంటాయని, అవసరమైన సహాయం అందిస్తామని తెలిపారు. రిటైర్ అయిన సిబ్బంది తమ సేవా కాలాన్ని గుర్తుచేసుకుంటూ పోలీస్ శాఖలో పనిచేయడం గర్వకారణమని, విధుల్లోని అనుభవాలు జీవితానికి విలువైన పాఠాలుగా నిలిచాయని తెలిపారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమం మరపురాని అనుభూతిగా నిలిచిందని, పోలీస్ శాఖతో అనుబంధం కొనసాగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు (పరిపాలన), శ్రీనివాసులు (క్రైమ్స్), శ్రీనివాస రావు (సాయుధ దళం), ఎస్‌బి డిస్పి గీతా కుమారి, అసోసియేషన్ ప్రెసిడెంట్ సోము, అధ్యక్షులు నిరంజన్, సెక్రటరీ శంకర్ రెడ్డి, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పదవ తరగతిలో శ్రీవాణి విద్యామందిర్ విద్యార్థుల ప్రభంజనం...

- కరస్పాండెంట్ హెడ్మాస్టర్ విద్యాసాగర్.

**శ్రీకాళహస్తి ఏప్రిల్ 30 (జన సంఘర్షణ):**

శ్రీకాళహస్తి పట్టణంలో ప్రతి ఏడాది పదవ తరగతి పరీక్షల్లో వందకి వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తూ గుర్తింపు పొందుతున్న ఏకైక విద్యాసంస్థ గా శ్రీ వాణి విద్యా మందిర్ పాఠశాల మంచి గుర్తింపు సాధించుకుంది. 2025-2026 సంవత్సరంలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలలో శ్రీ వాణి విద్యా మందిర్ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. టి.ధనుష్ 600 మార్కులకు గాను 592 మార్కులు సాధించి స్కూల్లో ప్రథమ స్థానం సాధించాడు. ద్వితీయ స్థానం పి. శృతి 600కు 575 మార్కులు సాధించిగా, తృతీయ స్థానంలో విష్ణు తేజ 600కు 561 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఈ పాఠశాలకు మూడవ ర్యాంకు సాధించి ఘనత దక్కించుకుంది. పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులు మొత్తం పరీక్షకు హాజరైన వారు - 22 మంది కాగా 22 మంది ఉత్తీర్ణులై వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు.ప్రతి సంవత్సరం శ్రీకాళహస్తి లో 100 కి 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్న ఏకైక విద్యాసంస్థ శ్రీవాణివిద్యామందిర్ స్కూల్ కే సొంతం చేసుకుంది. 600 మార్కులకు గాను 500 మార్కులు పైగా సాధించినవారు 1. టి. ధనుష్ - 592 2. పి.శృతి - 575 3. ఏ.విష్ణు తేజ - 561 4. ఏ.లేమ శ్రీ - 550 5.కె . హనీషా - 549 6.వి . మోనికా - 540 7. ఎస్.కె . అఫ్రీన్ భాను- 538 8. ఎస్ డి . చాన్ షరీఫ్ - 510 9. పి అశ్రీత - 506పై విజయానికి కారకులైన విద్యార్థిని విద్యార్థులకు తల్లి దండ్రులకు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు కరెస్పాండంట్ ఎన్ విద్యాసాగర్ ధన్యవాదములు తెలిపారు.



# వైభవంగా ప్రారంభమైన శ్రీ పద్మావతి అమ్మవారి వసంతోత్సవాలు

- మే 1న స్వర్ణరథోత్సవం
- శేషాచలాన్ని తలపించిన శుక్రవారపు తోట

**తిరుచానూరు, ఏప్రిల్ 30 (జన సంఘర్షణ)**


య తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక వసంతోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మే 1న ఉదయం ఉదయం 9.30 గంటలకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా జరుగనుంది. వసంత ఋతువులో మేషరాశిలో సూర్యుడు ఎక్కువ ప్రకాశవంతంగా ఉంటాడు. సూర్యకిరణాల వేడి వల్ల జీవులకు వ్యాధి బాధలు కలుగుతాయి. శ్రీ పద్మావతి అమ్మవారిని వసంతోత్సవాల ద్వారా ఆరాధించడం వల్ల భక్తులకు శారీరక, మానసిక శాంతి లభిస్తుందని విశ్వాసం.

**వైభవంగా స్నపన తిరుమంజనం.**

వసంతోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు అమ్మవారి ఉత్సవర్లను ఆలయం నుండి శుక్రవారపు తోటకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. 2.30 గంటల నుండి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా పసుపు, కుంకుమ, పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు అమ్మవారిని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించనున్నారు.

**శేషాచలాన్ని తలపించిన శుక్రవారపుతోట**

టిటిడి ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారపు తోటలో శేషాచలం అడవిని తలపించేలా తీర్చిదిద్దారు. పచ్చని చెట్లు, పుష్పాలు, జంతువుల ఆకృతులు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఆవు, దూడ, కోతి, నెమలి, హంసలు, చిలుకలు వంటి రూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇందులో 300 కేజిల వట్టి వేరు, 500 కేజిల సాంప్రదాయ పుష్పాలు, 15 వేల కట్ ఫ్లవర్స్‌తో వివిధ రకాల ఫలాలు వినియోగించారు. ఇందులో బెంగళూరు, హైదరాబాద్‌కు చెందిన అలంకరణ నిపుణులు, టిటిడి సిబ్బంది ఇందుకోసం పనిచేశారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సంగీత



కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ, ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏవిఎస్వో రాధాకృష్ణమూర్తి, ఏఈవో దేవరాజులు, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్లు ముని చెంగల్రాయులు, రమేష్, సురేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి, ప్రసాద్, మునస్వామి విశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# నాయీ బ్రాహ్మణులకు భరోసా ఇచ్చింది టిడిపినే!

- వైద్యం శాంతారాం, కోట చంద్రశేఖర్, టిడిపి పార్టీ

**శ్రీకాళహస్తి ఏప్రిల్ 30 (జన సంఘర్షణ):**



తరతరాలుగా కుల వృత్తిని ఆధారంగా చేసుకొని చాలీచాలని జీతభత్యాలతో జీవనం సాగిస్తున్న నాయీ బ్రాహ్మణ కుటుంబాలలో వెలుగులు నింపి, వారి జీవితాలకు భరోసా ఇచ్చింది తెలుగుదేశం పార్టీనే అని తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు వైద్యం శాంతారాం, తెలుగుదేశం పార్టీ నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్ కొనియాడారు.తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ప్రమాణస్వీకారం చేసిన నాయీ బ్రాహ్మణ రాష్ట్ర నాయకులు చొప్పెళ్ళ శ్రీను నాయీ బ్రాహ్మణ కుటుంబ సభ్యుల ఆశీర్వాద బలంతో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటూ,గురువారం మంగళగిరి లోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద ఆయనను ఘనంగా సత్కరించారు.ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను వెతుక్కోలేక, సాంప్రదాయిక కుల వృత్తిని మాత్రమే నమ్ముకొని తీవ్రమైన అణచివేతకు గురవుతున్న నాయీ బ్రాహ్మణులు అటు రాజకీయంగా ఇటు ఆర్థికంగా అభివృద్ధి చెంది, సమాజంలో గౌరవాన్ని పొందేందుకు అనేక అవకాశాలు కల్పించింది తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తోనే అని, టిడిపి వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు ఏవిధంగా అయితే నాయీ బ్రాహ్మణ కుటుంబాలకు అండగా నిలిచారో, సియం చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి , తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ కూడా తమ బాగోగులు చూసుకుంటున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు,తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు వైద్యం శాంతారాం, తెలుగుదేశం పార్టీ నాయీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర నాయకులు ఈదర శ్రీనివాసులు,నాయీ బ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పుల్లేటికుర్తి రమేష్, తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్,వంగపూడి వాసు తదితరులు పాల్గొన్నారు.

# నేడే మండలానికి ప్రభుత్వ విప్ రాక

**కార్వేటినగరం ఏప్రిల్ 30 (జన సంఘర్షణ):**



కార్వేటి నగరం మండలం టీ కే యం పేట పంచాయతీలో శుక్రవారం ఉదయం 9 గంటలకు గంగాధర్ నెల్లూరు శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ డాక్టర్ వి ఎం థామస్ చే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో రాధికా సింగిరెడ్డి తెలిపారు. అదేవిధంగా ఆ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆమె తెలిపారు.

# ప్రధానోపాధ్యాయులు నరేంద్ర కుమార్ చేసిన సేవలు మరో లేనిది

**కార్వేటి నగరం ఏప్రిల్ 30(జన సంఘర్షణ):**




కార్వేటినగరం మండలం టి కే ఎం పేట పంచాయతీ లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న నరేంద్ర కుమార్ పదవి విరమణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో గ్రామస్తులు మాట్లాడుతూ 23వ సంవత్సరం పాటు సేవలు అందించారు ఇతని సేవలు మరో లేవన్నారు. అనంతరం గ్రామస్తులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది జయరాజ్, మునీంద్ర, పరంధామ, విక్రమ్ రెడ్డి, రాఘవేంద్ర పురుషోత్తం చాందిని యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాలలో విజయభేరి మ్రోగించిన కుప్పం పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

**కుప్పం,ఏప్రిల్ 30 (జన సంఘర్షణ):**




10 వ తరగతి ఫలితాలలో కుప్పం పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి మార్కులతో ప్రభంజనం సృష్టించారు. పెద్దమల్లు లక్ష్మి ఈశ్వర్ చంద్ రెడ్డి 592/600 మార్కులతో ప్రథమ స్థానం, అనహిత షిజో 590/600 మార్కులతో ద్వితీయ స్థానం, సి.చరణ్ కుమార్ 582/600 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. 31 మంది విద్యార్థులు 500 లకు పైన మార్కులు సాధించారు. వీరిలో 19 మంది 550 పైన మార్కులు సాధించారు. మిగిలిన వారు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. సబ్జెక్ట్ పరంగా తెలుగు 100/100 ఇద్దరు, హింది 100/100 నలుగురు, గణితం 100/100 ఇద్దరు, సైన్స్ 100/100 ఒకరు, సోషియల్ 100/100 ఒకరు సాధించారు.ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను పాఠశాల ఛైర్ పర్సన్ యన్. శాంతా నాగరాజ్, బి సి యన్ విద్యా సంస్థల సెక్రటరీ సాగర్ రాజ్ , ప్రధానోపాధ్యాయురాలు దమయంతి అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# గ్రామీణ ప్రాంతాల్లో రౌడీయిజం అల్లర్లు చేస్తే ఖబర్దార్

- సిఐ హనుమంతప్ప.

**కార్వేటి నగరం ఏప్రిల్ 30 జన సంఘర్షణ**




గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడబడితే అక్కడ రౌడీయిజం చేస్తూ అల్లర్లు సృష్టిస్తే ఖబడ్దార్.. అని కార్వేటి నగరం సిఐ హనుమంతప్ప హెచ్చరించారు.. గురువారం ఎస్‌ఆర్ పురం పోలీస్ స్టేషన్లో కార్వేటినగరం సర్కిల్లో ఉన్న ఎస్సై లతో పాటు సిఐ హనుమంతప్ప విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా సిఐ హనుమంతప్ప మాట్లాడుతూ ఎస్ఆర్ పురం కార్వేటినగరం వెదురుకుప్పం పాలసముద్రం మండలాల్లో ఎక్కడైనా మద్యం సేవించి అల్లర్లు చేస్తూ ప్రజలకు ఆటంకం కలిగిస్తే వారిని జైలుకే పరిమితం చేస్తాం. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బంది పెడితే మాత్రం అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని, హెచ్చరించారు.. రౌడీయిజం,, శారీరక హింస, బలవంతపు వసూళ్లు, బెదిరింపులకు పాల్పడు వారి పై పీడీ యాక్ట్ ప్రయోగిస్తాం. అలాగే కొన్ని ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాము, డ్రోన్ నిఘా కూడా ఉంటుంది అని సీఐ తెలిపారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
01 మే 2026

## పెద్దలు మందాబి ఓబుల్ రెడ్డి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తో కలిసి పరామర్శించిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి.

**నెల్లూరు జిల్లా- జన సంఘర్షణ:**



నెల్లూరు 15 వ డివిజన్ లో పెద్దలు మందాభి ఓబుల్ రెడ్డి ఈనెల 25వ తేదీన కాలం చేయడంతో వారి కుమారులు జనార్ధన్ రెడ్డి రఘురామ్ రెడ్డి లతో పాటు కుటుంబ సభ్యులను మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తో కలిసి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఓబుల్ రెడ్డి కుటుంబ సభ్యులకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధైర్యం చెప్పారు.

## పదవ తరగతి ఫలితాల్లో ఖాన్స్ రెయిన్బో స్కూల్ మండలంలో నెంబర్ వన్

- విద్యార్థుల మెరుగైన ప్రతిభతో స్కూల్ రికార్డు ఫలితాలు

**రేణిగుంట, జన సంఘర్షణ**



జి.బాను 592 జి.జస్మిత 592 షేక్ హఫ్సాహ్ 590



సి.మోనిషా రెడ్డి 590 బి. కీర్తిక 590 డి. రీతిక 589

ఏప్రిల్ 30 : రేణిగుంట పట్టణంలోని ఖాన్స్ రెయిన్బో స్కూల్ 2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచింది.పాఠశాల విద్యార్థులు ఉన్నత మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం దక్కించుకోవడంతో స్కూల్కు మంచి పేరు తీసుకువచ్చారు.ఈ ఫలితాల్లో ద్రైదీప్య జస్మితా జి,బాను జి ఇద్దరూ 600 మార్కులకు గాను 592 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచారు.మోనిషా రెడ్డి సి,హఫ్సా షేక్,కీర్తిక బి 590 మార్కులు సాధించి ద్వితీయ స్థానాన్ని పొందారు. రీతిక 589 మార్కులు సాధించి తృతీయ స్థానాన్ని దక్కించుకుంది.విద్యార్థుల ఈ అద్భుత ఫలితాలపై పాఠశాల యాజమాన్యం,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.క్రమశిక్షణతో కూడిన బోధన,విద్యార్థుల కృషి వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని కరస్పాండెంట్ అత్తా ఉల్లా ఖాన్ తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ విద్యార్థులను అభినందిస్తూ,భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించింది.అదేవిదంగా 2026--27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రకటించారు.

## మే డే సందర్భంగా మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ


**/బంగారుపాలెం ఏప్రిల్ 30.. జన సంఘర్షణ**




బంగారుపాలెం మండల పరిధిలో ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా మండల మెకానిక్స్ వారి ఆధ్వర్యంలో మే డే సందర్భంగా జెండా ఆవిష్కరణ రాష్ట్ర అధ్యక్షులు దాయినేని ధర్మారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల అధ్యక్షులు పురుషోత్తమ నాయుడు మాట్లాడుతూ, మండలంలో ఇంతవరకు ఆఫీస్ లేకపోవడంతో, మెకానిక్స్ కి మండల పరిధిలో స్థలం కేటాయించాలని దాయీనేని ధర్మారావు కు వినతి పత్రం అందించారు. మెకానిక్ కి మండల పరిధిలో ఇంటి స్థలాలు కేటాయించాలని మండల అధికారులను కోరారు. దీనిపై రాష్ట్ర అధ్యక్షులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మెకానిక్స్ యూనియన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చిట్టిబాబు, కార్యదర్శి రాజా, ఉప కార్యదర్శి విజయ్ కుమార్, కోశాధికారి కుమార్ రాజా, కార్యనిర్వాహక సభ్యులు మురళి, షౌకత్, షేక్ రసూల్, ఉమేష్, మహబూబ్ బాషా, బాబా, శివకుమార్, హరీష్, సుహేల్, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఎన్నిక

**నాగలాపురం, ఏప్రిల్ 30, జన సంఘర్షణ**





ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాగలాపురం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ తెలిపారు. గురువారం మండల కేంద్రమైన నాగలాపురం పంచాయతీలోని సుందరయ్య కాలనీలో వ్యవసాయ కార్మికులతో మండల కమిటీ సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా దాసరి జనార్ధన్ మాట్లాడుతూ నాగలాపురం మండల అధ్యక్షురాలుగా పి ప్రమీల, ఉపాధ్యక్షులుగా ఎస్ గౌరీ, కార్యదర్శిగా ఆర్ మురుగేష్, సహాయ కార్యదర్శిగా అశ్విని, అమ్ముదా, కార్యవర్గ సభ్యులుగా సుబ్బమ్మ, దినమణి, పద్మ దక్షిణామూర్తి , పయనమ్మ, బాలాజీ, మునుస్వామి మేనక, అమృత, సంగీత నవీనలు ఎన్నికైనట్లు తెలిపారు. మండలంలో పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై పనిచేసి ఎక్కువ గ్రామాలకు విస్తరించాలని సూచించారు .భూ సమస్యలు, ఇళ్ల స్థలాలు ఉపాధి హామీ సమస్యలపై నిరంతరం పనిచేయాలని నూతన కమిటీని కోరారు. మే నెల రెండవ తేదీన సత్యవేడులో జరిగే జిల్లా మహాసభలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## పదవ తరగతి ఫలితాల్లో విపిఆర్ విద్య పాఠశాల విద్యార్థుల ప్రభంజనం

- 594 మార్కులతో టాప్ లో నిలిచిన సీహెచ్.మానస
- 100 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు
- పదో తరగతిలో ఫలితాల్లో మొత్తం 31 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, అందరూ ఉత్తీర్ణత.

**నెల్లూరు జిల్లా-జన సంఘర్షణ:**












నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మానసపుత్రిక, విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నడుస్తున్న విపిఆర్ విద్య పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. బుధవారం విడుదల చేసిన ఫలితాల్లో పాఠశాల విద్యార్థులు 100కు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. అందులో సీహెచ్ మానస అనే విద్యార్థిని 600కు 594 మార్కులు సాధించి టాప్‌లో నిలిచింది. తర్వాత శ్రీ మాన్య 587 మార్కులు, నిదర్శిని 579 మార్కులు సాధించారు. పదో తరగతిలో ఫలితాల్లో మొత్తం 31 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 31 మంది ఉత్తీర్ణత సాధించి విజయదుంధుబి మోగించారు. వారిలో 28 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించడం విశేషం. విద్యార్థులు సాధించిన విజయం పట్ల నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నెల్లూరులోని విపిఆర్ క్యాంపు కార్యాలయంలో విపిఆర్ దంపతులను కలిసిన సిహెచ్ మానసను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థిని ఉన్నత చదువులకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలు, ఆర్థిక సహాయం అందిస్తామని వారు స్పష్టం చేశారు. అలాగే పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌ను, సిబ్బందిని, తల్లిదండ్రులను, విద్యార్థులను అభినందించారు. మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కనుపర్తిపాడులో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2016లో 'వి.పి.ఆర్ విద్య' పాఠశాల ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తూ వస్తున్నారు. పాఠశాలలో చదివే నిరుపేద పిల్లలకు అన్నీ ఉచితంగానే అందిస్తున్నారు. ప్రతి ఒక్క విద్యార్థికి స్కూల్ యూనిఫాం, పుస్తకాలు, షూస్, బ్యాగ్స్, ఇతర వస్తువులు అన్నీ ఉచితంగానే ఇస్తారు. పరిశుభ్రమైన వాతావరణంలో వండిన భోజనాన్ని పిల్లలకు మధ్యాహ్నం ఉచితంగా పెడతారు. అలాగే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నారు. ఆర్వో వాటర్ ప్లాంట్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరును పిల్లలకు సమకూరుస్తున్నారు.

## సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేశాం: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

- నెల్లూరు జిల్లాలో జరగనున్న మహానాడును విజయవంతం చేయండి.
- త్వరలోనే కొత్త పెన్షన్లు, ఇళ్ల పట్టాలు.

**నెల్లూరు జిల్లా-జన సంఘర్షణ:**



కొడవలూరు మండలంలోని తాటాకుల దిన్నె గ్రామంలో 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డును కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో గత 30 ఏళ్లుగా స్మశానానికి సరైన దారి లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి 5 లక్షల ఎంపీ లార్డ్స్ నిధులతో స్మశాన వాటికకు వెళ్లే రహదారిని నిర్మించినట్లు ఆమె తెలిపారు. త్వరలోనే ఈ మార్గాన్ని పూర్తిస్థాయి సిసి రోడ్డుగా మారుస్తామని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి హామీ ఇచ్చారు. స్మశానానికి దారి కోసం స్థలాన్ని కేటాయించిన స్థల దాత ఉయ్యాల దేశయ్యను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ?గ్రామ పర్యటనలో భాగంగా ఎస్సీ కాలనీ ప్రజల విన్నపాన్ని మన్నిస్తూ త్వరలోనే అక్కడ వాటర్ ట్యాంక్ మంజూరు చేయిస్తామని గ్రామంలో అవసరమైన మరిన్ని రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని చెబుతూ సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని ఆమె కొనియాడారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీతో పాటు, మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే స్త్రీ శక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని ప్రజలకు వివరించారు. అర్హులైన వారందరికీ త్వరలోనే కొత్త రేషన్ కార్డులు, ఇళ్ల పట్టాలు అందజేస్తామన్నారు. నెల్లూరు జిల్లాలో జరగనున్న తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడులో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొడవలూరు మండలం తెలుగుదేశం, జనసేన, బిజెపి ముఖ్య నాయకులతో పాటు కార్యకర్తలు మరియు అధికారులు పాల్గొన్నారు.

## పూతలపట్టు మండల టాపర్ పి కొత్తకోట హై స్కూల్ విద్యార్థి జయ కిషోర్ 591

**పూతలపట్టు ఏప్రిల్ 30 (జన సంఘర్షణ)**



1ST : N JAI KISHORE : 591
ZPHS P.KOTHAKOTA



2ND : K SAHITHYA : 585
ZPHS THALUPULAPALLE



3RD : P DIVYA SREE : 583
ZPHS POLAVARAM

పదవ తరగతి ఫలితా పి లుల్లో పూతలపట్టు మండలం లోని 11 హైస్కూల్లో ఒక గురుకుల పాఠశాల ఉండగా పి కొత్తకోట ఉన్నత పాఠశాల చెందిన ఎన్ జయ కిషోర్ 591 మార్కులు సాధించి పూతలపట్టు మండల టాపరుగా నిలిచాడు.రెండవ స్థానం తాళ్లపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన కె.సాహిత్య 585. మూడవ స్థానం పోలవరం ఉన్నత పాఠశాలకు చెందిన పి. దివ్యశ్రీ 583 మార్కులు సాధించారు. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 100% పాస్ అయ్యారు గురుకుల పాఠశాల టాపర్గా కే హర్షవర్ధన్ 573 మార్కులు సాధించాడు.మండలంలో బాలికలు 99% పాస్ అయ్యారు. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 100% ఆకను పట్టు ఉన్నత పాఠశాల 90% ఈసీ పల్లి 83% ఏం బండపల్లి 97% ముత్తిరేవల 90 శాతం పి కొత్తకోట 95 శాతం పోలవరం 100% పూతలపట్టు 89% తలుపులపల్లి 100% వావిల్ తోట 95% ఉత్తీర్ణులైనట్టు ఎంఈఓ లు వాసుదేవన్. మధుసూదన్ తెలిపారు. మండల టాపర్ గా నిలిచిన విద్యార్థిని అభినందించారు.

## స్టేట్ ర్యాంక్ సాధించిన నంద్యాల నారాయణ విద్యా సంస్థలు

**నంద్యాల,ఏప్రిల్ 30.జన సంఘర్షణ**






పదవ తరగతి పరిక్షా ఫలితాలలో మా నంద్యాల నారాయణ పాఠశాల విద్యార్తులు అద్భుత ప్రతిభ కనబరిచి 100% ఉత్తీర్ణత సాధించిన మరియు గరిష్టంగా 597 మార్కులు సాధించి ప్రథమ స్థానాన్ని పొందారు. అదే విధంగా 596, 595, 594,593, 592, 591, మార్కులు మరియు 590 పైన మార్కులు సాధించిన వారు 7 మంది ఉండడం గర్వించ దగ్గ విషయం. అదే విధంగా 580కి పైగా 20 మంది, 550 కి పైగా 57 మంది, 540 కి పైగా 67 మంది, 500 లకు పైగా 92 మంది విద్యార్థులు మార్కులు సాధించారు. మొత్తం విద్యార్థులు సగటు మార్కులు 530 గా నమోదయ్యాయి. అదే విధంగా మొత్తం 116 మంది విద్యార్థులు పరిక్షకు హాజరు కాగా తెలుగులో 84 మంది, హిందీలో 59 మంది, ఇంగ్లీషులు 62 మంది, మాథ్స్ లో 15 మంది, సైన్స్ 52 మంది, సోషల్ లో 90 మంది, 90 మార్కులకు పైగా సాధించడం జరిగింది. మరియు 60% మంది విద్యార్థులు 90% పైగా మార్కులు సాధించారు. ఈ ఫలితాలు మా పాఠశాలలోని నాణ్యమైన బోధన, ఉపాధ్యాయుల కృషి మరియు ఉపాధ్యాయులు, కృషి మరియు విద్యార్థుల కఠిన శ్రమకు నిదర్శనం పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు తల్లితండ్రులు అందరూ ఈ విజయానికి కారణమయ్యారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచిన విద్యార్థులను నంద్యాల నారాయణ విద్యా సంస్థల ాూ+వీ ప్రశాంత్ , =× చంద్ర మౌళిశ్వర్ రెడ్డి, ప్రిన్సిపల్స్ రవీంద్ర, మరియు అంజనిదేవి అభినందించారు. మరియు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co